thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 58 | జగిత్యాల | గురువారం | 21 మే, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

### కోల్‌కతా సూపర్ విక్టరీ



11

## నా శవంపై కాషాయ జెండా కప్పాలి

### ఫేక్ ప్రచారాలను పట్టించుకోను

### భగీరథ్‌ను నేనే పోలీసులకు అప్పగించా

- కొత్త పార్టీ, బర్తరఫ్, అరెస్ట్ వార్తలు అవాస్తవం
- బీఆర్ఎస్ గడీలను బద్దలు కొట్టినందుకే కక్ష సాధింపు ప్రయత్నాలు
- బండి సంజయ్ భావోద్వేగ వ్యాఖ్యలు

3





# ఇక జిల్లాలకూ ఐటీ వెలుగులు

## హైదరాబాద్ వెలుపల జీసీసీలు

- 'బియాండ్ హైదరాబాద్'పై సీఎం రేవంత్‌రెడ్డి ఫోకస్!
- వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ హైవేల వెంట జీసీసీ
- భారీ డేటా సిటీ కోసం 1500 ఎకరాల భూసేకరణ..
- పెట్టుబడుల కోసం 'ఇన్వెస్ట్ తెలంగాణ'
- టీ-ఫైబర్ ప్రాజెక్టుకు మూడు నెలల డెడ్‌లైన్..
- ప్రభుత్వ కార్యాలయాలన్నీ అనుసంధానం కావాల్సిందే



### తీవ్రమైన ఎండలు సీఎం సూచనలు

ప్రజలంతా అప్రమత్తం కావాలి

జాగ్రత్తలు తీసుకునేలా కలెక్టర్లు చూడాలి

2

**హైదరాబాద్:** తెలంగాణలో సమాంతర ప్రాంతీయ అభివృద్ధి, ద్వితీయ శ్రేణి నగరాల ప్రగతే లక్ష్యంగా ఐటీ రంగాన్ని జిల్లాలకు విస్తరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఐటీ, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలలో రాష్ట్రాన్ని సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేందుకు ఆయన పనుల్లో వేగం పెంచా రు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్ఆర్డీ)లో జరిగిన పరిశ్రమలు, ఐటీ శాఖల ఉన్నత స్థాయి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు పలు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. ఐటీ కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాల్లోని యువతకు స్థానికంగానే ఉపాధి కల్పించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. హైదరాబాద్ వెలుపల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్ (జీసీసీల), ఐటీ సంస్థలను ఏర్పాటు చేసే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు (ఇన్సెంటివ్స్) ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, విజయవాడ రహదారుల వెంట అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను తక్షణమే గుర్తించాలని ఆదేశించారు. ఈ ప్రాంతాలలో జీసీసీల ఏర్పాటును ప్రోత్సహించేలా సరికొత్త 'ఐటీ అండ్ ఇండస్ట్రియల్ పాలసీ'ని తీసుకురా వాలన్నారు.

మిగతా 2 లో



## జనగణనలో కులగణనకు సుప్రీం ఓకే

- వ్యతిరేకిస్తూ వచ్చిన పిటిషన్లు తిరస్కరణ

4

### లంచగొండి అధికారులపై

## ఫిర్యాదు చేస్తే రూ.లక్ష

- అవినీతి నిర్మూలనపై సీఎం విజయ్ ఫోకస్
- ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యం
- ప్రభుత్వ శాఖలకు మూడు నెలల గడువు

4



## చంద్రయాన్-3 మరో సంచలనం

4

విక్రమ్ ల్యాండింగ్ సమయంలో కీలక విషయం వెలుగులోకి..





2

## కోనేరులో పడి ముగ్గురు బాలల మృతి

- జగిత్యాల జిల్లాలో తీవ్ర విషాదం

## ఆసిఫాబాద్‌లో ఇందిరమ్మ పండుగ

మిగతా 2లో...



- జూన్ 2న రెండో విడత పథనికి శ్రీకారం
- ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్ల మంజూరు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి

2



## నేటి నుంచి సరస్వతీ అంత్యపుష్కరాలు

భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్న సీఎం రేవంత్

తొలి పుష్కర స్నానం చేయనున్న విజయేంద్ర సరస్వతి

హాజరు కానున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

విస్తృతంగా ఏర్పాటు చేసిన అధికార యంత్రాంగం

4



2



## బొగ్గు గ్యాసిఫికేషన్‌పై సింగరేణి ముందడుగు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి భేటీ

కొత్త బొగ్గు గనులు కేటాయించాలని విజ్ఞప్తి

3

తెలంగాణలో బొగ్గు వనరుల ఆధారిత పారిశ్రామికాభివృద్ధికి వేగం తీసుకురావాలనే లక్ష్యంతో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కీలక అడుగులు వేస్తోంది. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో సమావేశమయ్యారు.

### మెడికల్ షాపుల బంద్ విజయవంతం





ఆన్‌లైన్ మందుల అమ్మకాల కోసం ప్రవేశపెట్టిన జీవో నంబర్ 817 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా మెడికల్ దుకాణం బంద్ విజయవంతమైంది.

చురకలు






## తీవ్రమైన ఎండలు.. సీఎం సూచనలు

### ప్రజలంతా అప్రమత్తం కావాలి.. జాగ్రత్తలు తీసుకునేలా కలెక్టర్లు చూడాలి

**హైదరాబాద్, మే 20:** తీవ్రమైనవడ గాలులు, ఎండ తీవ్రతపైవాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలోప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రతఎక్కువగాఉండనున్నందున ఆయా జిల్లాల అధికారులు అవసరమైన జాగ్రత్తలుతీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగినసంఖ్యలో అందుబాటులో ఉంచాలని, తాగు నీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలు జిల్లా ఆసుపత్రుల వరకు వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగాఉండాలని, వడదెబ్బతో ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే తగిన వైద్య సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ప్రయాణాలు చేయకుండా ఉండాలని సీఎం సూచించారు. ఆయా జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కలెక్టర్లకు దిశానిర్దేశర చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## కోనేరులో పడి ముగ్గురు బాలల మృతి

### జగిత్యాల జిల్లాలో తీవ్ర విషాదం



**జగిత్యాల, మే 20:** జగిత్యాల జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మేడిపల్లి మండలం కొండాపూర్‌లో ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తూ మృతిచెందారు. శివగంగా ఆలయ కోనేరులో పడి ప్రాణాలు కోల్పోయారు. మృతిచెందిన చిన్నారులను మన్వీత్ (11), మనస్వి (9), శార్వింద్ (7)గా గుర్తించారు. ఈరోజు (బుధవారం) మధ్యాహ్న సమయంలో సరదాగా ఆడుకునేందుకు ఆలయం వద్దకు వెళ్లిన చిన్నారులు.. అనంతరం ఈత కొట్టేందుకు కోనేరులో దిగారు. అయితే ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయారు. కాపాడాలంటూ కేకలు వేశారు. కొద్దిసేపటి తర్వాత ప్రమాదాన్ని గమనించిన స్థానికులు కోనేరులో నుంచి వారిని బయటకు తీశారు. ముగ్గురినీ హుటాహుటిన జగిత్యాల ప్రభుత్వ క్రిటికల్ కేర్ ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. భారతి-భూషణం దంపతుల పిల్లలు మన్వీత్, మనస్వి కాగా.. భార్గవి-శేఖర్ కుమారుడు శార్వింద్. చిన్నారుల మృతితో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. మరోవైపు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## యువతి కిడ్నాప్ కేసు సుఖాంతం

### ఛేజ్ చేయడంతో పారిపోయిన దుండుగులు

**హైదరాబాద్, మే 20:** అత్తాపూర్‌లో యువతి కిడ్నాప్ కథ సుఖాంతంగా ముగిసింది. ఎట్టకేలకు యువతిని పోలీసులు ట్రేస్ చేశారు. మలక్‌పేట్‌లోని తన ఇంట్లోనే యువతి సేఫ్‌గా ఉన్నట్లు తెలిపారు. ఫోన్ నంబర్ ఆధారంగా యువతిని పోలీసులు గుర్తించారు. అత్తాపూర్ జోయ్ ఆస్పత్రి వద్ద అర్ధరాత్రి యువతి కిడ్నాప్ అవడం సంచలనం సృష్టించింది. ఓ యువతిని కొందరు వ్యక్తులు థార్ కార్‌లో వచ్చి అందరూ చూస్తుండగానే బలవంతంగా కిడ్నాప్ చేశారు. విషయం తెలిసిన వెంటనే అప్రమత్తమైన పోలీసులు రంగంలోకి దిగారు. యువతిని కిడ్నాప్ చేసిన కారును ఛేజ్ చేశారు. అయితే కిడ్నాపర్లు పోలీసులకు చిక్కకుండా పారిపోయారు. కార్‌కు నంబర్ ప్లేట్ లేకపోవడంతో వివరాలు సేకరించడం పోలీసులకు కష్టంగా మారింది. జోయ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్ సూపర్వైజర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. యువతిని కొందరు వ్యక్తులు బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే కిడ్నాప్‌కు ముందు యువతి ఆస్పత్రి పక్కనే ఉన్న రత్నదీప్ సూపర్ మార్కెట్‌కు వెళ్లి అక్కడ కొన్ని వస్తువులను కొనుగోలు చేసి.. ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఫోన్ నంబర్ ఆధారంగా.. మలక్‌పేటకు చెందిన యువతిగా నిర్ధారించారు. అక్కడకు వెళ్లి చూడగా.. యువతి తన ఇంట్లోనే సేఫ్‌గా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

## మెడికల్ షాపుల బంద్ విజయవంతం

హైదరాబాద్, మే 20: ఆన్‌లైన్ మందుల అమ్మకాల కోసం ప్రవేశపెట్టిన జీవో నంబర్ 817 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా మెడికల్ దుకాణం బంద్ విజయవంతమైంది. ఈ మేరకు మెడికల్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మెడికల్ షాపులు బంద్ పాటిస్తూ కొద్దిసేపు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాలు చేయడం అధికంగా డిస్కౌంట్ ఇవ్వడం ద్వారా నాసిరకమైన మందులు మార్కెట్లో చలామణి అవుతున్నాయని, దీని ద్వారా చిన్న మెడికల్ షాపుల పై తీవ్ర ప్రభావం చూపడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోకపోవడంతో దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ పాటిస్తున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి 817 జీవోను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# ఇక జిల్లాలకూ ఐటీ వెలుగులు

మొదటి పేజీ తరువాయి



భవిష్యత్తు డిజిటల్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ఏకంగా 1500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఒక సరికొత్త 'డేటా సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించాలన్నారు. అయితే, ఈ డేటా సిటీల నిర్వహణకు భారీగా నీటి అవసరం ఉంటుందని, అందుకోసం ప్యూర్ వాటర్ కాకుండా ఎస్టీపీల ద్వారా రీసైకిల్ చేసిన నీటినే వినియోగించేలా పక్కా ప్లాన్ రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రతిష్టాత్మక 'ఫ్యూచర్ సిటీ' అభివృద్ధిపై సీఎం ప్రత్యేకంగా సమీక్షించారు. ఫ్యూచర్ సిటీలో పూర్తి పర్యావరణ హిత 'నెట్-జీరో' విధానాలను అమలు చేయాలని, ప్రపంచ స్థాయి సదుపాయాలతో 'ఏఐ సిటీ'ని నిర్మించాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'హెల్త్ క్లస్టర్' మన ఫ్యూచర్ సిటీకే వచ్చేలా చూడాలని, అవసరమైతే దీని కోసం తాను స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీని కలిసి అభ్యర్థిస్తానని సీఎం పేర్కొన్నారు. హెల్త్ సిటీ పనులను వేగవంతం చేయాలని, కంపెనీలు భూమిపూజలకు సిద్ధంగా ఉండేలా ల్యాండ్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయాలన్నారు. భారీ అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ఒక ప్రత్యేక ఏజెన్సీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇన్వెస్టర్లకు ఒకే వేదికపై సింగిల్ విండో పద్ధతిలో అన్ని అనుమతులు మంజూరు చేసే విధానం రావాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో అమలు చేయాలని సూచించారు. అలాగే, యువతలో నైపుణ్యాభివృద్ధి పెంచేందుకు 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'తో పారిశ్రామిక కంపెనీలు ఒప్పందాల ్చేసుకునేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక డిజిటల్ నెట్‌వర్క్ ప్రాజెక్ట్ 'టీ-ఫైబర్'పై సీఎం రేవంత్ రెడ్డి గడువు విధించారు. రాబోయే మూడు నెలల్లోగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు తప్పనిసరిగా ఈ నెట్‌వర్క్‌కు కనెక్ట్ కావాల్సిందేనని డెడ్‌లైన్ పెట్టారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.54 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు సీఎంకు వివరించారు. వీటితో పాటు, రాష్ట్రంలో రాబోయే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం భూసేకరణ పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# నేటి నుంచి సరస్వతీ అంత్యపుష్కరాలు

- భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్న సీఎం రేవంత్
- పుష్కర స్నానం చేయనున్న విజయేంద్ర సరస్వతి
- హాజరు కానున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- విస్తృతంగా ఏర్పాటు చేసిన అధికార యంత్రాంగం



**హైదరాబాద్, మే 20:** తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సరస్వతీ అంత్య పుష్కరాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. మే 21 నుంచి జూన్ 1 వరకు కాళేశ్వరంలో జరిగే ఈ పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులు భక్తిశ్రద్ధలతో పుష్కర స్నానాలు ఆచరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా భక్తులు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని కోరారు. బుధవారం తెల్లవారుజామున 5.43 గంటలకు తొలి పుష్కర స్నానంతో పుష్కరాలు ప్రారంభమవుతాయి. కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి తొలి పుష్కర స్నానం చేయనుండగా, గవర్నర్ శివప్రతాప్ శుక్లా కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ 12 రోజుల పుష్కరాలకు సుమారు 30 నుంచి 40 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.30.63 కోట్లతో విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. పుష్కర ఘాట్ ప్రాంతాల్లో 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. భద్రత కోసం ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు, సేఫ్టీ బోట్లు, ప్రత్యేక శిక్షణ పొందిన 100 మంది గజ ఈతగాళ్లను మోహరించారు. భక్తుల రాకపోకల కోసం 90 షటిల్ బస్సులు నడపనున్నారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ హోమాలు, హారతులు, తెప్పోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయగా, నాగేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం 500 టాయిలెట్లు, తాగునీటి కోసం ప్రత్యేక ఓహెచ్ఆర్సీలు, 23 పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. లక్షా 70 వేల వాహనాలు వచ్చే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని 245 ఎకరాల్లో పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. వైద్య సేవల కోసం 23 జోన్లలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. 300 మంది వైద్య సిబ్బంది, పారామెడికల్ సిబ్బందిని నియమించగా, అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు. మహదేవ్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెఫరల్ ఆసుపత్రిగా ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా పుష్కర ఘాట్ ప్రాంతాల్లో చలువ పందిళ్లు, కాయర్ మ్యాట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం 300 మంది సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. గతంలో జరిగిన సరస్వతీ ఆది పుష్కరాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# భారీగా గంజాయి పట్టివేత



**హైదరాబాద్, మే 20:** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైగ్రేడ్ గంజాయి భారీగా పట్టుపడింది. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఇద్దరు ప్రయాణికుల వద్ద గంజాయిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు గుర్తించారు. నిందితులు విమానం దిగిన వెంటనే డీఆర్ఐ అధికారులకు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని నిలువరించి లగేజీ తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. నిందితులు అత్యంత చాకచక్యంగా వాటర్ బాటిల్స్, స్నాక్ టిన్స్, ఫుడ్ బాక్సుల్లో హైగ్రేడ్ గంజాయిని ప్యాక్ చేసి స్మగ్లింగ్‌కు ప్రయత్నించారు. మొత్తం 8.705 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.3.05 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన డీఆర్ఐ అధికారులు.. ఇద్దరు నిందితులను ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్ట్ చేశారు. ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న డ్రగ్స్ నెట్‌వర్క్, ఇతర సంబంధాలపైనా మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఇటీవల గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు, బంగారం వంటి విలువైన వస్తువులు తరలిస్తూ స్మగ్లర్లు భారీగా పట్టుపడుతున్నారు.

# ఆసిఫాబాద్‌లో ఇందిరమ్మ పండుగ

### జూన్ 2న రెండో విడత పథనికి శ్రీకారం

### నియోజకవర్గానికి 3500 ఇండ్ల మంజూరు

### ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి



**కొమరం భీమ్ ఆసిఫాబాద్, మే 20:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న పేదల సొంతింటి కలలను నిజం చేసే ప్రతిష్టాత్మక 'ఇందిరమ్మ ఇండ్ల' రెండో విడత కార్యక్రమానికి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వేదిక కానుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లాలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం రాష్ట్ర ఆబ్కారీ, మధ్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె. హరిత, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తదితరులతో కలిసి మంత్రి సభాస్థలి, రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్, కాగజ్‌నగర్ మండలం దాదానగర్, సిర్పూర్ పేపర్ మిల్ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి సందర్శించనున్న ప్రాంతాలతో పాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా 1 లక్ష 20 వేల ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయనీ, జూన్ నాటికి 2 లక్షల 35 వేల ఇండ్లు పూర్తవుతాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణం ఆర్భాటాలకు మాత్రమే పరిమితమైందని, కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 4 లక్షల ఇండ్ల నిర్మాణానికి రూ.22,700 కోట్లతో శ్రీకారం చుట్టిందన్నారు. ఇంటి నిర్మాణ పురోగతికి అనుగుణంగా దశలవారీగా రూ.5 లక్షలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. మొదటి, రెండో విడతలకే పరిమితం కాకుండా అర్హత గల ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే వరకు ప్రభుత్వం కృషి కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆదివాసీ జిల్లా కొమరం భీమ్ ఆసిఫాబాద్‌లోని కొఠారి గ్రామంలో గిరిజన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం ద్వారా ఆదివాసీల సొంతింటి కష్టాలను తొలగిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి, రేషన్ కార్డులు, ఇందిరా మహిళా శక్తి, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా మహిళను కుటుంబానికి ఆధారస్తంభంగా గుర్తిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. నంతరం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో 2026-28 సంవత్సరాలకు గాను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

## సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు

## అధికారులతో సమీక్షించిన ప్రత్యేక ప్రధానకార్యదర్శి

**హైదరాబాద్, మే 19:** జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ముందుగా గన్ పార్క్ ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ వేడుకల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్, గన్ పార్కు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లపై ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారి నియమించి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పరేడ్ గ్రౌండ్ కు వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ తోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ఆయన ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్ , నగరంలోని ప్రముఖ ప్రదేశాలైన అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం, చార్మినార్, ప్రజాభవన్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ నుంచి పరేడ్ గ్రౌండ్ వద్ద అన్ని విభాగాలు సంయుక్తంగా రిహార్సల్స్ చేపట్టాలని ఆదేశించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నవీన్ మిట్టల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శి రఘునందన్ రావు, డిజిపి మహేశ్ భగవత్, ఎడిజి(ఇంటలిజెన్స్) విజయ్ కుమార్, టిజి జెన్కో సిఎండి హరీష్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# డ్రగ్స్ బాధితుల కోసం డీ-అడిక్షన్ సెంటర్లు..

## సైబర్ క్రైమ్ నియంత్రణపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు!

**హైదరాబాద్:** రాష్ట్రంలో మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టడంతో పాటు డ్రగ్స్ బారిన పడిన బాధితులను ఆదుకునేందుకు ప్రత్యేక డీ-అడిక్షన్ (వ్యసన విముక్తి) కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (వీజ=ఎ=ఐ) 'బోధి పెవిలియన్'లో పోలీస్ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ హైలెవెల్ భేటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర భద్రతా సలహాదారు శివధర్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు అదనపు డీజీలు, పోలీస్ కమిషనర్లు, ఐజీలు పాల్గొన్నారు. పోలీస్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి నాన్-క్యాడర్ ఐపీఎస్ వరకు ఎవరికైనా ప్రమోషన్ వచ్చిన తర్వాత.. వారు ఖచ్చితంగా రెండేళ్ల పాటు ఇతర విభాగాలలో (అదర్ వింగ్స్) పని చేసేలా నిబంధన తీసుకురావాలని సీఎం సూచించారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా సీఎస్, డీజీపీలను ఆదేశించారు. అలాగే, అంతర్గతంగా అన్ని విభాగాలు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయం (కోఆర్డినేషన్) మరింత పెరగాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పెరుగుతున్న సాంకేతిక నేరాల దృష్ట్యా రాష్ట్రంలో ఫోరెన్సిక్ సెంటర్లు, డేటా సెంటర్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ అభ్యర్థుల శిక్షణ (ట్రైనింగ్) సమయంలోనే సైబర్ క్రైమ్ విభాగంలో పని చేయడం కోసం ప్రతిభావంతులను సెలెక్ట్ చేయాలని సూచించారు. అంతేకాకుండా, నూతనంగా ఏర్పాటవుతున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో పోలీస్ విభాగం కోసం సైబర్ క్రైమ్ నియంత్రణపై ప్రత్యేక కోర్సును ప్రవేశపెట్టాలన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, అసలు నగరంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ఫైర్ డిపార్ట్‌మెంట్ కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. మున్సిపల్ శాఖ, 'హైడ్రా' (న్ణ=ూ) లతో సమన్వయం చేసుకుంటూ జూన్ 15 లోగా ఫైర్ సేఫ్టీపై సమగ్ర నివేదిక ఇవ్వాలని డెడ్‌లైన్ విధించారు. అలాగే నాలాల మెయింటెనెన్స్ కోసం మెట్రో వాటర్ వర్క్స్, మ్యాన్‌హోల్స్ నిర్వహణ కోసం పోలీస్, ట్రాఫిక్ పోలీస్, హైడ్రా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు సంయుక్తంగా బాధ్యత వహించాలన్నారు.

### అడ్డగోలు ఫ్లెక్సీలపై ఉక్కుపాదం.. నైట్ పెట్రోలింగ్ పెంపు

హైదరాబాద్ నగరంలో నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా ఫ్లెక్సీలు కడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీఎం అధికారులను నిలదీశారు. నగర అందాలను దెబ్బతీసే ఇలాంటి అక్రమ ఫ్లెక్సీల విషయంలో పోలీస్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ (+ఎవీజ) అధికారులు అత్యంత కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. వీటితో పాటు నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ (చీఅస్త్రస్త్రూఘతీశీశ్రీ) ను మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు.

# నా శవంపై కాషాయ జెండా కప్పాలి

- ఫేక్ ప్రచారాలను పట్టించుకోను
- భగీరథ్‌ను నేనే పోలీసులకు అప్పగించా
- కొత్త పార్టీ, బర్తరఫ్, అరెస్ట్ వార్తలు అవాస్తవం
- బీఆర్ఎస్ గడీలను బద్దలు కొట్టినందుకే కక్ష సాధింపు
- బండి సంజయ్ భావోద్వేగ వ్యాఖ్యలు



**హైదరాబాద్, మే 20:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తనపై జరుగుతున్న ప్రచారాలపై తీవ్రంగా స్పందించారు. తాను కొత్త పార్టీ పెడుతున్నానంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని స్పష్టం చేశారు. బీజేపీ పట్ల తన నిబద్ధత జీవితాంతం కొనసాగుతుందని, "చనిపోయాక నా శవంపై కాషాయ జెండా కప్పాలి" అనేదే తన చివరి కోరిక అని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి బండి సంజయ్ విచ్చేయగా భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. "బీజేపీ జిందాబాద్", "మోదీ జిందాబాద్", "బండి సంజయ్ జిందాబాద్" అంటూ నినాదాలతో కార్యాలయం మార్మోగింది. కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. దాదాపు రెండు గంటల పాటు కార్యకర్తలతో గడిపిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కొత్త పార్టీ పెడుతున్నారనే ప్రశ్నకు స్పందించిన బండి సంజయ్, "బండి సంజయ్ అంటే ఏమిటో రాష్ట్ర ప్రజలకు తెలుసు. బీజేపీ కోసం జీవితాన్ని అంకితం చేసిన కార్యకర్తను నేను. ఫాల్తుగాళ్లు చేసే ప్రచారానికి స్పందించాల్సిన అవసరం లేదు" అన్నారు. "బీజేపీలో కమిట్‌మెంట్‌తో పనిచేసే ప్రతి కార్యకర్త చివరి కోరిక ఏమిటంటే... చనిపోయాక తన శవంపై కాషాయ జెండా కప్పాలని కోరుకుంటాడు. నాది కూడా అదే కోరిక" అని పేర్కొన్నారు. కేంద్ర మంత్రివర్గం నుంచి తనను తొలగించబోతున్నారనే ప్రచారంపై బండి సంజయ్ వ్యంగ్యంగా స్పందించారు. "తెలంగాణలో బీఆర్ఎస్‌కు 17 మంది ఎంపీలు ఉన్నారు కదా? బహుశా కేంద్ర ప్రభుత్వం వాళ్ల సహకారంతోనే నడుస్తోందేమో. అందుకే నన్ను బర్తరఫ్ చేయాలనే నిర్ణయం కేసీఆర్, కేటీఆర్ తీసుకుని ఉంటారు" అంటూ ఎద్దేవా చేశారు. తన అరెస్టుపై వస్తున్న వార్తలను కూడా బండి సంజయ్ ఖండించారు. "కేసీఆర్ కొడుకు విసిరే చిల్లర మెతుకులకు ఆశపడి కొన్ని ఛానళ్లు, సోషల్ మీడియా వేదికలు ఫేక్ కథనాలు ప్రచారం చేస్తున్నాయి. బీఆర్ఎస్ గడీల పాలనను బద్దలు కొట్టాం. పదేళ్ల కుటుంబ పాలనను అంతం చేశాం. అందుకే కక్ష సాధింపుతో ఇలాంటి ప్రచారం చేస్తున్నారు" అని ఆరోపించారు. బండి భగీరథ్ కేసుపై వస్తున్న ఆరోపణల గురించి స్పందిస్తూ, "ఒక తండ్రిగా నేను నా కొడుకును స్వయంగా పోలీసుల విచారణకు అప్పగించాను. చట్టం ముందు అందరూ సమానమే. కానీ నన్ను, బీజేపీని బదనాం చేయడానికే సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం చేస్తున్నారు" అన్నారు. "ఎన్ని విష ప్రచారాలు చేసినా ప్రజలు బీజేపీతోనే ఉన్నారు. ఫేక్ వార్తలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు" అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# విద్యారంగంలో పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు

- సాస్కీ పథకం కింద రూ.5వేల కోట్ల ప్రత్యేక సాయం
- నిర్మలా సీతారామన్‌ను కోరిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి



**న్యూఢిల్లీ, మే 20:** విద్యారంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సాయం అందించాలరి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న భట్టి బుధవారం నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సాస్కీ పథకం కింద రూ. 5వేల కోట్ల ప్రత్యేక సాయం, విద్యారంగంలో పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు ఇవ్వాలని కేంద్రమంత్రిని భట్టి విక్రమార్క కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి ఇప్పటికే రూ. 4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమన్నారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. 2014-2023 మధ్య ప్రత్యేక ప్రయోజన సంస్థల (ఎస్‌పీవీ) ద్వారా తీసుకున్న అప్పుల భారం, వాటి చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందంటూ కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని నిర్మలా సీతారామన్ దృష్టికి భట్టి విక్రమార్క తీసుకెళ్లారు. 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి మొత్తం రూ. 30,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళిక రూపొందించిందని, దీనిలో రూ. 21,000 కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల క్యాంపస్‌ల నిర్మాణం, మరో రూ. 9,000 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థలు, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు.

# జొన్న రైతుల ఆందోళన

**ఆదిలాబాద్, మే 20:** గతకొన్నిరోజులులగా జొన్న రైతులు ఆందోళన చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. తాజాగా బజార్ హత్నూర్ మండల కేంద్రంలో జొన్న పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జొన్న కొనుగోలు చేసి వారం గడిచినా కూడా లోడింగ్ చేయకపోవడంతో వర్షానికి మొక్కజొన్న సంచులు తడిసిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జొన్న పంట ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. తడిసిన ధాన్యాన్ని కూడా ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో రైతుల వద్ద సేకరించిన జొన్న పంటను గోదాముల్లోకి తరలించడంలో జాప్యం జరుగుతున్నది. జొన్నల కొనుగోళ్లపై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి అమ్మకాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డుల్లో వేల క్వింటాళ్ల జొన్నలను కాంటా వేసి సంచుల్లో నింపిన లారీలు, హమాలీల కొరత కారణంగా గోదాముల్లోకి తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. రైతుల పంటను కాంటా చేసిన పీఏసీఎస్ సిబ్బంది వారికి కొనుగోళ్ల పత్రాలు ఇవ్వడం లేదు.



# స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

## ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన రవాణాశాఖ

**హైదరాబాద్, మే 20:** రాష్ట్రంలో పాఠశాలలు, విద్యాసంస్థలు జూన్‌లో పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు రవాణా శాఖ అధికారులు వెల్లడించారు. విద్యార్థులను రవాణా చేసే అన్ని విద్యాసంస్థల బస్సులు , ఇతర వాహనాలు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఫిట్‌నెస్ లేని వాహనాలు, అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించుకొని నడుపుతున్న వాహనాలు, భద్రతా ప్రమాణాలు పాటించని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికేట్ కచ్చితంగా ఉండాలని సూచించారు. వాహనాలలో అనుమతించిన సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవర్లకుడ్రైవింగ్ లైసెన్స్ , అనుభవం , ఫస్ట్ ఎయిడ్ బాక్స్,, ÷ర్ ఎక్సిటింగ్విషర్, ఎమ్జ్గ÷న్సీ ఎగ్జిట్ వంటి భద్రతా సౌకర్యాలు, విద్యార్థుల భద్రత కోసం అటెండర్‌ను నియమించాలన్నారు. ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న వాహనాలు లేదా ఓవర్‌లోడ్ చేస్తున్న వాహనాలను వెంటనే సీజ్ చేస్తామన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించుకునే వాహనాలలో తమ పిల్లలను పంపవద్దని తల్లిదండ్రులకు రవాణా శాఖ సూచించింది.

# బొగ్గు గ్యాసిఫికేషన్‌పై సింగరేణి ముందడుగు

- కిషన్‌రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి భేటీ
- కొత్త బొగ్గు గనులు కేటాయించాలని విజ్ఞప్తి



**న్యూఢిల్లీ, మే 20:** బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరులకు అదనపు విలువ కల్పించడంతో పాటు, ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, విధానపరమైన సహకారం, కేంద్ర పథకాల అనుసంధానంలో బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారం అందించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆయన కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో సమావేశమయ్యారు . ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్?ఎఎ మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా, భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశవ్యాప్తంగా బొగ్గు గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, సింగరేణి కూడా ఆ దిశగా ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. కోల్ ఇండియా చేపడుతున్న గ్యాసిఫికేషన్ కార్యక్రమాల తరహాలోనే, సింగరేణి కూడా తన బొగ్గు వనరులను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సింగరేణి దక్షిణ భారతదేశ బొగ్గు సరఫరా, విద్యుత్ రంగ అవసరాల తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థ అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగరేణికి కొత్త బొగ్గు వనరుల సమీకరణ అత్యవసరమని తెలిపారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ పరిధిలోని కొయ్యగూడెం బ్లాక్?ఎఎఎ తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఈ బ్లాక్ వేలంలో కేటాయించబడినప్పటికీ నాలుగేళ్లు గడిచినా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొయ్యగూడెం బ్లాక్ ఎఎఎను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిచెర్ల కోల్ బ్లాక్ ఎఎ అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ బ్లాక్‌కు సంబంధించి సింగరేణి ఇప్పటికే ప్రీ-మైనింగ్ కార్యకలాపాలు, అన్వేషణ పనులు చేపట్టిందని, మైనింగ్ లీజ్ పక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. తాడిచెర్ల కోల్ బ్లాక్?ఎఎ అభివృద్ధి సింగరేణి భవిష్యత్ అవసరాలకు, తెలంగాణ విద్యుత్ భద్రతకు కీలకమని చెప్పారు. తాడిచెర్ల కోల్ బ్లాక్?ఎఎకు ఓఓఆఖీ చట్టం, 1957లోని సెక్షన్ 5 కింద ముందస్తు అనుమతి మంజూరు చేసి, మైనింగ్ లీజ్ పక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు. అంశాలపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సింగరేణి బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రణాళికలు, కొయ్యగూడెం బ్లాక్ ఎఎఎ కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్?ఎఎ మైనింగ్ లీజ్ అంశాలపై సంబంధిత కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో త్వరలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ డా. జ్యోతి బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ గౌతమ్ పొట్రు, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) శ్రీ కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చురకలు





# ట్రంప్ దూకుడుకు అమెరికా సెనెట్ కత్తెర!

**ఇరాన్‌పై యుద్ధ హెచ్చరికల మధ్య అధ్యక్ష అధికారాలపై పరిమితులు**

**పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు.. ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు**

**ప్రపంచం మొత్తం ఆర్థిక సంక్షోభం, యుద్ధ భయాలు, ఆహార కొరతలతో వణుకుతున్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం ఇరాన్‌పై యుద్ధ డప్పు మోగిస్తూనే ఉన్నారు. "చర్చలు విఫలమైతే రెండు మూడు రోజుల్లోనే దాడులు ప్రారంభమవుతాయి" అంటూ ట్రంప్ చేసిన హెచ్చరికలు అంతర్జాతీయంగా కలకలం రేపుతున్నాయి.**

ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..తనకేమీ పట్టనట్టు ట్రంప్ మహాశయుడు ఫిడేల్ వాయిస్తున్నాడు. యుద్ధం ..యుద్ధం అంటూ కలవరిస్తున్నారు. ఇరాన్‌పై దాడులు తప్పవని హెచ్చరిస్తున్నాడు. అయితే పశ్చిమాసియా యుద్ధానికి సంబంధించి తాజాగా తీవ్ర ఉత్కంఠ పరిణామాలు చకచకా చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం తెరవెనక సాగుతున్న చర్చల్లో ఒప్పందం కుదరకుంటే... 2-3 రోజుల్లోనే.. లేదంటే వచ్చే వారం ఆరంభంలో తాము ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దీంతో మరోమారు ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇప్పటికే అమెరికా సహా అన్ని దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నా ట్రంప్ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ కళ్ళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. దీంతో అయినా ట్రంప్ దూకుడు ఆగతుందా అన్నది చూడాలి. ఇకపోతే ఇరాన్‌తో భారీస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, అవి సఫలమై.. మా దాడి ప్రణాళిక శాశ్వతంగా అటకెక్కుతుందని ఆశిస్తున్నా అంటూ ట్రంప్ తాజాగా వెల్లడించాక ఈ తీర్మనం వచ్చింది. టెహ్రాన్ చేతికి అణ్వాయుధాలు దక్కకుండా ఉండే ఒప్పందం మాకు ఆమోదయోగ్యమవుతుందని శ్వేతసౌధంలో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై భారీ స్థాయిలో వెంటనే దాడులు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని తమ అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మంగళవారమే భారీ స్థాయి-ంలో దాడులు జరపాలనుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే అరబ్ దేశాల నేతల విజ్ఞప్తి మేరకు చివరి నిమిషాల్లో ఆ ప్రణాళికను తాత్కాలికంగా పక్కనపెట్టానన్నారు. టెహ్రాన్‌తో చర్చలు సీరియస్‌గా సాగుతున్నాయని, అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరే అవకాశాలు ఉండటం వల్లే దాడుల నిర్ణయాన్ని ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో ట్రంప్ వ్యవహాఇర శైలి చూస్తుంటే ఆయన దేనికైనా తెగిస్తాడని అనుకోవాలి. ఇకపోతే ఇరాన్ కూడా గట్టిగానే సమాధ్యానం ఇస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేస్తే.. తాము యుద్ధరంగంలో కొత్త సాధనాలతో, సరికొత్త విధానాల్లో విరుచుకుపడతామని ఇరాన్ హెచ్చరించింది. తమను దిగ్బంధించడం, ఓడించడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొంది. టెహ్రాన్‌లోని వాలియాస్ స్క్వేర్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆ దేశ సైన్యాధికారి బ్రిగేడియర్ జనరల్ మహమ్మద్ అక్రమినియా ఈ వ్యాఖ్యలు చేశారు. తమ సాయుధ దళాలు గతంలో కంటే ఇప్పుడు మరింత బలంగా, సన్నద్ధంగా ఉన్నాయని ఇరాన్ పేర్కొంది. సైన్యం ట్రిగ్గర్‌పై వేలు పెట్టి సిద్ధంగా ఉందని హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను హతమారిస్తే.. 58 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.560 కోట్లు) బహుమతిగా ఇస్తామని ఇరాన్ త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు 'ఇస్లామిక్ రిపబ్లిక్ భద్రతా దళాల ప్రతిచర్య' పేరిట బిల్లును సిద్ధం చేస్తున్నట్లు ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఛైర్మన్ ఇబ్రహీమ్ అజీజ్ తెలిపారు. దీనిపై త్వరలోనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. తమ దేశంలోని బరకాహ్ అణు విద్యుత్కేంద్రంపై ఇటీవల దాడి చేసిన డ్రోన్లు ఇరాక్ భూభాగం నుంచి దూసుకొచ్చాయని యూఏఈ రక్షణ శాఖ మంగళవారం వెల్లడించింది. ఇరాన్ మద్దతున్న షియా మిలీషియాలు వాటిని ప్రయోగించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఇటీవల చేసిన దాడులు పర్యావరణానికి హానికరంగా మారి, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ ఆయిల్ ర్గి÷నైరీపై జరిగిన ఓ దాడితో సముద్ర జలాల్లోకి చమురు చేరి.. అలల ద్వారా పర్షియన్ గల్ఫ్‌లోని శిద్వార్ దీవిపైకి కొట్టుకొచ్చింది. అది జనావాసాల్లేని దీవి. వణ్యప్రాణులు చాలానే ఉన్నాయి. చమురు వ్యాప్తితో వాటి మనుగడకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. అమెరికా దూకుడు తగ్గకుంటే ప్రపంచంలో ఆర్థిక, ఆహార సంక్షోభం తీవ్రం కానుంది. ఇప్పటికే గల్ఫ్ దేశాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి. ఇది మరింత తీవ్రం అయ్యే ప్రమాదం ఉంటి. ఖతార్ లాంటి దేశాల్లో ఆహార కొరత తీవ్రంగా ఉంది. వారి వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో శాంతి చర్చలకు ప్రపంచ దేశాలు ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉంది.

# చంద్రయాన్-3 మరో సంచలనం

- విక్రమ్ ల్యాండర్ కీలక ఆవిష్కరణ
- విక్రమ్ ల్యాండింగ్ సమయంలో కీలక విషయం వెలుగులోకి..



**బెంగళూరు:** ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ మరో కీలక శాస్త్రీయ ఆవిష్కరణకు దారితీసింది. విక్రమ్ ల్యాండర్ చేసిన చిన్న 'హాప్ ఎక్స్‌పెరిమెంట్' చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంత ఉపరితలం గురించి కొత్త వివరాలను బయటపెట్టింది. మిగిలిపోయిన ఇంధనాన్ని ఉపయోగించుకోవాలనే అనూహ్య నిర్ణయంతో ఈ ప్రయోగం చేపట్టారు. చంద్రుడిపై శివశక్తి పాయింట్ వద్ద ఉన్న నేల గతంలో భావించిన దానికంటే చాలా వైవిధ్యమైనదని, సంక్లిష్టమైనదని వెల్లడించే ఒక మైలురాయిగా ఈ ప్రయోగం నిలిచింది. ఈ ప్రయోగంలో ల్యాండర్ సుమారు 40 నుంచి 50 సెంటీమీటర్లు పైకి ఎగిరి, కొద్దిదూరం పక్కకు వెళ్లి మళ్లీ సాఫ్ట్‌గా ల్యాండ్ అయింది. ఈ ప్రయోగం వల్ల చంద్రుడి ఉపరితలంపై ఉన్న పై పొర తొలగిపోయి, లోపలి మట్టిని చంద్ర సర్ఫేస్ థర్మోఫిజికల్ ఎక్స్‌పెరిమెంట్ పరికరం పరిశీలించే అవకాశం లభించింది. దీంతో చంద్రుడి మట్టి ఒకేలా కాకుండా పలు పొరలుగా ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. పైభాగం పొర చాలా మెత్తగా ఉండగా, కింద భాగం మరింత ఘనంగా ఉందని అధ్యయనం తెలిపింది. ఈ సమాచారం భవిష్యత్ చంద్ర మిషన్లకు చాలా కీలకంగా మారనుంది. ముఖ్యంగా నాసా ఆర్టెమిస్ మిషన్ ద్వారా చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలనే ప్రణాళికలకు ఈ డేటా ఉపయోగపడనుందని నిపుణులు చెబుతున్నారు. 2023 జులై 14న ప్రయోగించిన చంద్రయాన్ 3, చంద్రుని దక్షిణ ధృవం ఉపరితలంపై సురక్షితంగా ల్యాండ్ అయి ప్రపంచాన్ని అబ్బురపరిచింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొట్ట మొదటి దేశంగా భారత్ నిలిచింది.

# లంచగొండి అధికారులపై ఫిర్యాదు చేస్తే రూ.లక్ష బహుమతి!

**అవినీతి నిర్మూలనపై సీఎం విజయ్ ఫోకస్**

**ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యం**

**ప్రభుత్వ శాఖలకు మూడు నెలల గడువు**

**చెన్నై, మే 20:** తమిళనాడులో అవినీతిని అరికట్టేందుకు సీఎం విజయ్ ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం డిమాండ్ చేసే అధికారులపై ప్రజలు ఫిర్యాదు చేస్తే వారికి రూ.1 లక్ష వరకు బహుమతి ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. అవినీతి అధికారులపై నేరుగా ప్రజల నుంచే సమాచారం సేకరించే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్, ఆన్‌లైన్ పోర్టల్, ఫిర్యాదు వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదు చేసే వారి వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచుతామని ప్రభుత్వం హామీ ఇస్తున్నట్లు సమాచారం. అవినీతి నిరోధక శాఖలో కూడా సమూల మార్పులు తీసుకురావాలని సీఎం విజయ్ ఆదేశించినట్లు తెలుస్తోంది. శాఖలో రాజకీయ జోక్యం, అంతర్గత అవినీతి వ్యవహారాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, పోలీస్, మున్సిపల్, ట్రాన్స్‌పోర్ట్ శాఖల పనితీరుపై ప్రత్యేక నిఘా పెట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. టెండర్లు, కాంట్రాక్టులు, ఉద్యోగ నియామకాలలో పారదర్శకత తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సమాచారం. "ప్రజల డబ్బు పవిత్రమైనది.. అవినీతి చేసేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టం" అంటూ అధికారులకు సీఎం విజయ్ గట్టి హెచ్చరిక జారీ చేసినట్లు తెలుస్తోంది.






# ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం

**యుద్ధ అధికారాలను పరిమితం చేస్తూ తీర్మానం**

**వాషింగ్టన్, మే 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ క్లళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. ఫిబ్రవరి చివరిలో ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ఇరాన్ పై యుద్ధానికి దిగారు. యుద్ధంపై ట్రంప్ అధికారాలను పరిమితం చేసేందుకు డెమోక్రట్లు అనేకసార్లు సెనెట్‌లో ఓటింగ్ నిర్వహించారు. అయి-ంతే, వారి తీర్మానాలకు తగినంత ఓటింగ్ లభించలేదు. డెమోక్రటిక్ సెనెటర్ టిమ్ కెయిన్ తాజాగా మరోసారి సెనెట్ ముందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. యుద్ధ ప్రకటన, సైనిక చర్యకు కాంగ్రెస్ నుంచి స్పష్టమైన ఆమోదం లభిస్తే తప్ప.. ఇరాన్ లోపల లేదా దానికి వ్యతిరేకంగా జరిగే ఘ-ర్షణల్లో యూఎస్ దళాలు పాల్గొనకూడదని అందులో తెలిపారు. దీనికి 50 మంది అనుకూలంగా.. 47 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ఈ తీర్మానం ఆమోదంలో నలుగురు రిపబ్లికన్ సభ్యులు కూడా మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. కాగా.. ఈ బిల్లు ఆమోదానికి సంబంధించి త్వరలో తుది ఓటింగ్ జరగనుంది. ఇది చట్టంగా మారితే.. కాంగ్రెస్ అధికారికంగా సైనిక దాడి కొనసాగించడానికి అనుమతి ఇచ్చేవరకు ట్రంప్ ఇరాన్‌పై ఎలాంటి దాడులకు దిగకూడదు. ఓటింగ్ సందర్భంగా డెమోక్రటిక్ సెనెట్ చక్ షుమర్ మాట్లాడుతూ.. యుద్ధానికి సంబంధించిన నిర్ణయాలపై కాంగ్రెస్ తిరిగి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. 'ఈ అధ్యక్షుడు నిండుగా తూటాలున్న తుపాకీతో ఆడుకుంటున్న చిన్నపిల్లాడిలా ఉన్నాడు' అని వ్యాఖ్యానించారు. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చలు కొనసాగుతోన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ప్రభుత్వ రాయితీ పొందిన ఆస్పత్రులకు హెచ్చరిక

**పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిందే అన్న సుప్రీం**

**న్యూఢిల్లీ, మే 20:** సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ భూములను రాయితీ ధరలకు పొందిన ప్రైవేట్ ఆస్పత్రులు ఆర్థికంగా బలహీన వర్గాలకు తప్పనిసరిగా ఉచిత వైద్య సేవలు అందించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఢిల్లీ ప్రభుత్వానికి ప్రామాణిక కార్యాచరణ విధానం రూపొందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇచా రోగులకు ఉచిత చికిత్స అమలు విషయంలో కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ 51 ఆస్పత్రుల్లో కేవలం నాలుగు ఆస్పత్రులే నిబంధనలు పాటిస్తున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రైవేట్ ఆస్పత్రులు తమ ఇన్‌పేషెంట్ విభాగంలో 10 శాతం, అవుట్‌పేషెంట్ విభాగంలో 25 శాతం వరకు ఉచిత చికిత్స అందించడం తప్పనిసరని మరోసారి స్పష్టం చేసింది. 2018లో ఇచ్చిన తీర్పును సమర్థవంతంగా అమలు చేయడానికి స్పష్టమైన ÷ాక్షఖ రూపొందించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. న్యాయస్థానం తీర్పును ఉల్లంఘించినట్లు తేలిన 51 ఆస్పత్రుల్లో మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వేంకటేశ్వర, మూల్‌చంద్ హాస్పిటల్స్ ఉన్నాయి. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు తేలిన ఆస్పత్రులపై గతంలో ధిక్కరణ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడైంది. ఈ అంశంపై ఢిల్లీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మే 23వ తేదీన ఢిల్లీ సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. 'యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ మూల్‌చంద్ ఖైరతీ రామ్ ట్రస్ట్' కేసులో జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.



# జనగణనలో కులగణనకు సుప్రీం ఓకే

**వ్యతిరేకిస్తూ వచ్చిన పిటిషన్లు తిరస్కరణ**



**న్యూఢిల్లీ, మే 20:** కులగణనపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనగణనలో కులాల లెక్కింపునకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం అనుమతి ఇచ్చింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం కొట్టివేసింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించారు. సంక్షేమ పథకాల అమలుకు కులగణన తప్పనిసరి అని స్పష్టం చేసింది. కుల గణన ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. ఈ అంశంలో కోర్టుల జోక్యం ఉండదని స్పష్టం చేసింది. జన గణన.. కుల ప్రాతిపదికన జరగాలా వద్దా అనేది విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. వెనుకబడిన తరగతికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సి ఉందని ఈ ధర్మాసనం వ్యాఖ్యానించింది. నగణన నుంచి కులగణనను మినహాయించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం తిరస్కరించింది. ఈ అంశం ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని వివరించింది. అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని తెలిపింది. ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జయమల్యా బాగ్చీ, విపుల్ పంచోలీతో కూడిన ధర్మాసనం విచారించింది.

చురకలు



## ఘనంగా సామ రూపేష్ రెడ్డి జన్మదిన వేడుకలు

### రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆడే గజేందర్



**బేల:** ఆదిలాబాద్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సామ రూపేష్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం బేల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక గణేష్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం సామ రూపేష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ యువ నాయకుడు సామ రూపేష్ రెడ్డి సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. రక్తదాన శిబిరాల నిర్వహణ ద్వారా అనేక మందికి ప్రాణదాతగా నిలుస్తున్నారని ప్రశంసించారు. యువత సమాజ సేవలో చురుకుగా పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గిరిజన గృహాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు

- డీఏ జేజీయూఏ పథకం ద్వారా కోలంగూడా, పర్ధాన్ గూడాల్లో వెలుగులు



**కాగజ్నగర్:** కాగజ్నగర్ మండలం కోసిని గ్రామపంచాయతీ పరిధిలోని కోలంగూడా, పర్ధాన్ గూడా ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం లేని గిరిజన గృహాలకు ధర్తీ అబ్ జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏ జేజీయూఏ) పథకం ద్వారా ఉచిత విద్యుత్ కనెక్షన్లు అందజేశారు. ఇందులో భాగంగా అవసరమైన ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, అవసరమైన పరికరాలను అమర్చడంతో పాటు విద్యుత్ మీటర్లు బిగించి గిరిజన కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. దీంతో కోలంగూడా, పర్ధాన్ గూడా ప్రాంతాల్లోని గిరిజన ఆవాసాల్లో వెలుగులు నిండాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వసాకే పుల్లాబాయి మాట్లాడుతూ విద్యుత్ సౌకర్యం లేని గిరిజన గృహాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు కల్పించి, అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ జాడే ఉత్తమ్, డీఈ ఎంఆర్టీఅండ్ కన్స్ట్రక్షన్ బి.వీరేష్, డీఈ ఆపరేషన్ సి.నాగరాజ్, ఏడీఈ, ఎస్పీఎం పి.శ్రీనివాస్, ఏడీఈ కన్స్ట్రక్షన్ జె.రాజేశ్వర్, ఏఈ కన్స్ట్రక్షన్ జెహెచ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిచెల్మ ఆలయంలో ఘనంగా 'హెరిటేజ్ వాక్'




**ఆదిలాబాద్:** ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇచ్చోడ మండలంలోని ప్రసిద్ధ సిరిచెల్మ ఆలయంలో 'హెరిటేజ్ వాక్'కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ బంగారిగూడ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ఆలయ చారిత్రక, సాంస్కృతిక విశిష్టతను తెలుసుకున్నారు. స్థానిక వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, విద్యార్థుల్లో పర్యాటక ప్రదేశాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సిరిచెల్మ ఆలయ చరిత్ర, స్థానిక సంస్కృతి, పర్యాటక ప్రాధాన్యతతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రవికుమార్, కేజీబీవీ ఉపాధ్యాయులు, ఆలయ కమిటీ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటిన రోల్మామడ గ్రామస్తులు



**నేరడిగొండ:** నిరుపేద కుటుంబానికి అండగా నిలుస్తూ మండలంలోని రోల్మామడ గ్రామస్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన మాడావి దేవురావ్–సుశీల దంపతుల కుమార్తె గంగామణి వివాహం సందర్భంగా కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ ప్రజలు ఏకమై తమవంతు సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి బుధవారం రూ.20వేల నగదును గంగామణి కుటుంబ సభ్యులకు అందజేశారు. అవసర సమయంలో గ్రామం మొత్తం తమకు అండగా నిలవడంపై కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో పరస్పర సహకారం, ఐక్యతకు ఈ ఘటన నిదర్శనమని పలువురు పేర్కొన్నారు. గ్రామస్థుల సేవా దృక్పథాన్ని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యాదవ్రావు పటేల్, లింగు పూజారి, రామదాస్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువును మింగేస్తున్న అక్రమ తవ్వకాలు..!

- "జీవనాధారాన్ని కాపాడండి" అంటూ గ్రామస్తుల డిమాండ్




**కాగజ్నగర్:** సిర్పూర్ మండలంలోని చింతకుంట గ్రామ ప్రజల జీవనాధారమైన ప్రధాన చెరువు ప్రస్తుతం అక్రమ మట్టి తవ్వకాలతో కనుమరుగయ్యే పరిస్థితికి చేరుకుందని గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు పరిధిలో కంచెలు ఏర్పాటు చేసి, ఎలాంటి అధికార అనుమతులు లేకుండా రాత్రింబవళ్లు భారీ యంత్రాలతో మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గ్రామానికి తాగునీరు, సాగునీరు అందించే ఈ ప్రధాన చెరువు భూగర్భ జలాల పెరుగుదలకు కీలకమని, చెరువు నీటిపై వందలాది ఎకరాల వ్యవసాయం ఆధారపడి ఉందని తెలిపారు. ఇలాంటి కీలకమైన జలవనరును కొందరు అక్రమ దందాదారులు స్వార్ధ ప్రయోజనాల కోసం నాశనం చేస్తుండటం బాధాకరమని అన్నారు. చెరువు లోపల వరకు కంచెలు ఏర్పాటు చేయడంతో సాధారణ ప్రజలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. భారీగా మట్టి తరలింపుతో చెరువు సహజ స్వరూపం దెబ్బతింటోందని, వర్షాకాలంలో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా చెరువుకు నీరు చేరే ప్రధాన కాలువలు పూర్తిగా మూసుకుపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పలుమార్లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెబుతున్నారు. ప్రజల ఆస్తిని కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో చెరువు పూర్తిగా ఆక్రమణలకు గురై కనుమరుగయ్యే ప్రమాదం ఉందని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయడంతో పాటు చెరువు ఆక్రమణలను తొలగించి, మూసుకుపోయిన కాలువలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనియెడల గ్రామస్తులంతా పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ 'ప్రజాపాలన'కాదు.. పనికిమాలిన పాలన

- హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలం: బీఆర్ఎస్ నేత మజర్

**నేరడిగొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్నది 'ప్రజా పాలన'కాదని, పూర్తిగా పనికిమాలిన పాలన అని బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా నాయకులు మజర్ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 895 రోజులు గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని చెప్పినా, అది

సబ్సిడీ అందడం లేదని విమర్శించారు. రైతుబంధు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, జొన్నల కొనుగోలులో పరిమితులు విధించడం, గన్నీ సంచుల కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దత్తత జిల్లా అయిన ఆదిలాబాద్కు మూడు బడ్జెట్ సమావేశాలు ముగిసినా కనీస నిధులు కేటాయించకపోవడం జిల్లా ప్రజలను అవమానించడమేనని అన్నారు. ప్రజాపాలన పేరుతో ప్రభుత్వం వ్యతిరేక స్వరాలపై కేసులు పెట్టడం తప్పా అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. జూన్ 2న ఆదిలాబాద్కు రానున్న ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు, ఎయిర్పోర్ట్, ఇంజనీరింగ్




రావాలని డిమాండ్ చేశారు. కొడంగల్ తరహాలో ఆదిలాబాద్ అభివృద్ధికి రూ.5వేల కోట్లు కేటాయిం

# ఆవులు, దూడలను కుర్బానీ ఇవ్వొద్దు

**బక్రీద్ సందర్భంగా ప్రశాంత వాతావరణం కాపాడాలి**

**ముస్లింలకు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి**

**చురకలు విలేఖరి కరీంనగర్, మే, 19**

బక్రీద్ పండుగ సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఆవులు, ఆవు దూడలను కుర్బానీ ఇవ్వవద్దని కరీంనగర్ ఉమ్మడి జిల్లాల మస్జిద్, ఈద్గా, ఖబ్రస్తాన్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుల అసోసియేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ముస్లిం సోదరులకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఆవులను సరఫరా చేసినా, కుర్బానీకి ఉపయోగించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో హిందూ, ముస్లిం సోదరులు అన్నదమ్ముల్లా కలిసి అన్ని పండుగలను గంగా జమున తహజీబ్ సంప్రదాయంతో జరుపుకుంటారని తెలిపారు. ప్రతి పండుగ సందర్భంలో పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సామరస్య వాతావరణాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. బక్రీద్ సందర్భంగా ముస్లింలు మేకపోతు, గొర్రెపోతు, దున్నపోతు వంటి జంతువులను మాత్రమే కుర్బానీ ఇవ్వాలని సూచించారు. పండుగలను ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసు శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరిస్తున్నారని తెలిపారు.

పండుగల సమయంలో బంధుమిత్రులు ఇళ్లకు



వచ్చిపోతూ ఆనందంగా గడుపుతారని, పరస్పర ఆతిథ్యంతో సోదరభావాన్ని పెంపొందించుకోవడం ఉమ్మడి జిల్లాల ప్రత్యేకత అని మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ పేర్కొన్నారు.

మిల్లు యాజమాన్యం నిరంకుశ వైఖరిని వీడనాడి కార్మికులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని కోరారు. జిల్లాకు వచ్చిన ఇంచార్జి మంత్రి, కార్మిక శాఖ

కౌన్సిలర్ విశ్వేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ సిందం శ్రీనివాస్, నాయకులు సాయి చరణ్, మిల్లు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కాంగ్రెస్ నిరసన

- హన్మకొండ చౌరస్తాలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

**హన్మకొండ:** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచినందుకు నిరసనగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు హన్మకొండ చౌరస్తాలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ప్రజలపై మరింత ఆర్థిక భారాన్ని మోపే చర్య అని విమర్శించారు. ఇంధన ధరల పెంపుతో రవాణా ఖర్చులు పెరిగి, దాని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడుతూ సామాన్య ప్రజల జీవన వ్యయాన్ని మరింత పెంచుతోందని తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలపై అదనపు భారాలు మోపడం కాకుండా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.




ప్రజల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని, అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

**సత్తుపల్లి:** ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ అన్నారు. వేంసూర్ మండల కేంద్రంలో బుధవారం ఉపాధిహామీ కూలీల సమస్యలపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో అమలు చేస్తున్న రెండుసార్లు ఫొటో తీసే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.




కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.600 కూలి చెల్లించాలని కోరారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. పథకానికి నిధులు తగ్గించడం, ఫొటో విధానాన్ని అమలు చేయడం ద్వారా కూలీలకు సకాలంలో వేతనాలు అందడం లేదన్నారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం పేద కూలీలకు సరైన వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపుతోందన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ రంజాన్ బీ మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో మహిళలు అధిక సంఖ్యలో పనిచేస్తున్నప్పటికీ పనిస్థలాల్లో కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు మంచినీరు, ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు అందించడంతో పాటు మహిళల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన అనంతరం ఎంపీడీఓ కావ్యకు వినతి పత్రం అందజేశారు. ఇదిలా ఉండగా బికేఎంయు ఆధ్వర్యంలో షేక్ రంజాన్ బీ పుట్టినరోజు సందర్భంగా ఉపాధి కూలీలకు ఎంపీడీఓ కావ్య చేతుల మీదుగా నిమ్మరసం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంగ, అనసూయమ్మ, ఆదెమ్మ, సైదాబీ, ఆదాంబీ, జైమూన్, ఎంకమ్మ, మల్లేశ్వరి, రజిని, సత్యవాణి, ఏసమ్మ, మరియమ్మ, ఆదాం, ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలులో సమన్వయంతో పనిచేయాలి

**• వీసీ ద్వారా సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ ఆదేశాలు**

**ఆదిలాబాద్:** సంక్షేమ పథకాల అమలులో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామీణాభివృద్ధి, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులతో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్య దేవరాజన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నిర్దేశించిన రుణాల లక్ష్యాలను వంద శాతం సాధించాలని, కొత్త మహిళా సంఘాల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. గ్రామీణ యువత, బాలికల సాధికారత కోసం 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల వారితో 'స్నేహ'గ్రూపులను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సకాలంలో అందేలా ఆసరా, చేయూత పెన్షన్ దారులకు సంబంధించిన ఫేస్ అథెంటికేషన్, డెత్, మైగ్రేషన్ ప్రక్రియలను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం పెన్షన్లు పొందుతున్న వారి వివరాలను పారదర్శకంగా కొనసాగించేందుకు లైవ్ ఫేస్ అథెంటికేషన్, అర్హతల



క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని పేర్కొన్నారు. అలాగే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్బీఎస్) కింద అందించే రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అర్హులైన కుటుంబాలకు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాల అమలులో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా పరిషత్ సీఈఓ రవి, డీపీఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎంపీడీఓలు, సెర్ప్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న మాజీ జెడ్పీటీసీ

**• ఉండంలో శరవేగంగా గంగపుత్ర కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు**

**తలమడుగు:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాపక్షపాతిగా మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మరోసారి తన నిబద్ధతను చాటుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉండం గ్రామంలో గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల్లో భాగంగా బుధవారం స్లాబ్ నిర్మాణాన్ని ఆయన సమక్షంలో విజయవంతంగా పూర్తి చేశారు. గత ఎన్నికల ప్రచార సమయంలో గంగపుత్ర సంఘం సభ్యులకు ఇచ్చిన హామీ మేరకు గోక గణేష్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఎస్డీఎఫ్ నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో చేపట్టిన




కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. స్లాబ్ నిర్మాణం పూర్తవడంతో గ్రామస్తులు, సంఘం నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ పదవుల్లో ఉన్నా.. లేకున్నా ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకోవడమే తన లక్ష్యమన్నారు. గంగపుత్రుల చిరకాల స్వప్నమైన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించి పనులను వేగవంతం చేయడం ఆనందంగా ఉందన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు సి.రమేష్ రెడ్డి, వెంకన్న యాదవ్, సర్పంచ్ బోన్ల మహేందర్, ఉప సర్పంచ్ రఫిక్, మాజీ సర్పంచ్ లక్ష్మన్న, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ టి. గంగన్న, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పొచ్చన్న, కొంద్రు గంగన్న, అశోక్ రెడ్డి, శివయ్య, మహేష్, షారుఖ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి అభిప్రాయ సేకరణ

**• మండల అధ్యక్ష అభ్యర్థి ఎంపిక, గ్రామ కమిటీల ఏర్పాటుపై చర్చ**

**సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నూతన తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ఎంపికతో పాటు గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీల ఏర్పాటుపై మంగళవారం రాత్రి అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్




నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి నాయకత్వంలో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీని మరింత విస్తరింపజేస్తామని తెలిపారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, గ్రామ స్థాయి నుంచి పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా కమిటీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**తాండూర్:** కొత్తపల్లి రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు తాండూర్ ఎస్సై కె.ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి పోలీస్ స్టేషన్కు చేరుకుని సమాచారం అందించారని, సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా రైల్వే లైన్ పక్కన ఉన్న సిమెంట్ గోడ సమీపంలో వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. అక్కడ రైల్వే ట్రాక్ వద్ద పనిచేస్తున్న కార్మికులను విచారించగా.. మృతుడు మంగళవారం ఉదయం నుంచి రైల్వే ట్రాక్పై అసహజంగా తిరుగుతూ కనిపించినట్లు తెలిపారు. గేట్మెన్కు సమాచారం ఇవ్వడంతో అక్కడి నుంచి వెళ్లి సమీపంలో పనిచేస్తున్న కార్మికుల వద్ద మంచినీళ్లు తాగి తిరిగి వెళ్లాడని చెప్పారు. తర్వాత సమీపంలోని మామిడి తోటకు వెళ్లి తిరిగి వచ్చి పొలం నుంచి రైల్వే ట్రాక్పైకి దూకే సమయంలో అదుపు తప్పి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారని ఎస్సై తెలిపారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని చెప్పారు. మృతుడు మొదట గ్రే కలర్ టీ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని స్థానికులు తెలిపినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఎవరైనా మృతుడిని గుర్తుపడితే సెల్: 8712656575 కు సమాచారం అందించాలని కోరారు.



# ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లాకలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల:** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం జైపూర్ మండలం రామారావుపేటలో గల రైస్ మిల్, కోటపల్లి మండలం సర్వాయిపేటలోని గోదాం, వేమనపల్లి మండల కేంద్రంలోని గోదాములను సందర్శించారు. ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా



తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు సకాలంలో తరలించాలని ఆదేశించారు. రైస్ మిల్లుల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకునేందుకు అవసరమైన హమాలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో త్వరగా పూర్తి చేసేలా అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. లారీ యజమానులు ధాన్యం రవాణాలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, గోదాములకు చేరిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిల్వ చేసి తదుపరి ఆదేశాల మేరకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులకు స్వాగతం పలికిన ఆడే గజేందర్





**బోథ్:** జూన్ 2న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లను పరిశీలించేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఆసిఫాబాద్ జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా హెలిప్యాడ్ వద్దకు వచ్చిన మంత్రులకు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బోథ్ నియోజకవర్గ ఆడే గజేందర్ ఘన స్వాగతం పలికారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై మంత్రులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆడే గజేందర్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేసేందుకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడే గజేందర్తో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ



**భీంపూర్:** ఉపాధి హామీ కూలీల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు సర్పంచ్ దాసరి రమేష్ అన్నారు. భీంపూర్ మండలం పిప్పల్కోటి గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పథకం పనులను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో సుమారు 300 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటుండగా, వారి పనితీరు, సౌకర్యాలు, ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తీవ్ర ఎండల నేపథ్యంలో కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పని ప్రదేశాల్లో కూలీలకు నీడ కల్పించేందుకు ఏర్పాటు చేసిన గ్రీన్ మ్యాట్లను, తాగునీటి సదుపాయాలను తనిఖీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఆరోగ్య పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే తెలియజేయాలని సూచించారు. కూలీల ఆరోగ్యం, భద్రతకు గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట్ల శ్రీనివాస్, రెండ్లా భాస్కర్, షేక్ అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**



**మంచిర్యాల:** రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జన్నారం మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాము, మొర్రిగూడలోని రాఘవేంద్ర రైస్ మిల్ గోదాము, చింతగూడలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి సందర్శించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అవసరమైన లారీలను వెంటనే సమకూర్చాలని, రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, హమాలీలు, లారీలతో ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

• మెగా జాబ్ మేళాలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా




**ఆదిలాబాద్:** యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం మావల మండల కేంద్రంలోని చిలుకూరి లక్ష్మి గార్డెన్లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఎ పీవో మంద మకరందు, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూషలతో కలిసి ప్రారంభించారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ జాబ్ మేళాకు జిల్లా నలుమూలల నుంచి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా పూర్తి చేసిన 7,611 మంది అభ్యర్థులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలను చూపించేందుకు ఒకే వేదికపై 63 ప్రముఖ కంపెనీలను 16వేల ఉద్యోగ అవకాశాలతో తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీలు మాత్రమే సరిపోవని, యువత సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసమే ఎదురు చూడకుండా ప్రైవేట్ రంగంలో లభించే అవకాశాలను కెరీర్లో ఒక మెట్టుగా భావించి ముందుకు సాగాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల యువత అధైర్యపడకుండా ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలను ఎదుర్కొని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో జిల్లా యంత్రాంగం, నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, యువత ఉపాధి సాధనలో జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ యువత తమ ప్రతిభను నిరూపించుకుని ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ రంగంలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. నిరుద్యోగుల సంక్షేమం కోసం మరిన్ని ఉపాధి కార్యక్రమాలు, ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ జాబ్ మేళాలో పలు ప్రముఖ ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా, మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా, మొత్తం 1,775 మంది అభ్యర్థులు వివిధ దశల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో 159 మందికి అతిథుల చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. మరో 680 మంది తుది ఎంపిక కాగా, 936 మంది అభ్యర్థులు తదుపరి పరిశీలన కోసం షార్ట్లిస్ట్ అయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధికల్పన అధికారి మిల్కా, డివైఎస్ఓ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

• జిల్లాలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**కాగజ్నగర్:** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఆబ్కారీ, మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జూన్ 2న ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాటు చేయనున్న సభాస్థలి, రెబ్బెన మండలం కాగజ్నగర్ ఎక్స్రోడ్, కాగజ్నగర్ మండలం దాదానగర్, కాగజ్నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్ క్రీడా ప్రాంగణాన్ని బుధవారం పరిశీలించారు. ఆయన వెంట శాసన మండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 1.20 లక్షల ఇండ్లు మంజూరయ్యాయని, జూన్ నాటికి 2.35 లక్షల ఇండ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అదేవిధంగా 4 లక్షల ఇండ్ల నిర్మాణానికి రూ.22,700 కోట్లతో ప్రభుత్వం ముందడుగు వేసిందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు దశల వారీగా రూ.5లక్షలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. మొదటి, రెండో విడతలతో పరిమితం కాకుండా అర్హత కలిగిన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. జూన్ 2న ఆదివాసీ జిల్లా కొమురం భీమ్ ఆసిఫాబాద్లో జరగనున్న ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం

• తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ అన్వేష్ రెడ్డి

**ఆదిలాబాద్:** రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడం విత్తన డీలర్ల ప్రాథమిక బాధ్యత అని తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. నాణ్యమైన విత్తనాల ద్వారానే వ్యవసాయంలో మెరుగైన దిగుబడులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం విత్తన డీలర్లతో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విత్తనాల విక్రయాలు జరపాలని, వ్యాపారంలో పూర్తి పారదర్శకత పాటించాలని డీలర్లకు సూచించారు. రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా ప్రతి డీలర్ పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విత్తనాల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదన్నారు. రైతులు మోసపోకుండా అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో విత్తన డీలర్ల పాత్ర కీలకమని గుర్తు చేశారు.




ఈ అవగాహన సదస్సులో వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక విత్తన డీలర్లు, రైతు ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలి

• తాండూర్ గోదాంను పరిశీలించిన కలెక్టర్ కుమార్ దీపక్



**తాండూర్:** వరి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం తాండూర్ మండల కేంద్రంలోని ధాన్యం గోదాంను మండల తహశీల్దార్ జ్యోత్స్నతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు సకాలంలో తరలించాలని సూచించారు. గోదాములకు చేరిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం భద్రపర్చాలని, తదుపరి ఆదేశాల మేరకు రవాణా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు టి.మురళీధర్ రావు, బి.పద్మజ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి–ఖమ్మం మధ్య 3 స్టాప్స్ డీలక్స్ సర్వీసులు ప్రారంభం

**సత్తుపల్లి:** సత్తుపల్లి నుంచి ఖమ్మం వరకు ప్రతిరోజూ 3 స్టాప్స్ డీలక్స్ బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం నుంచి ఈ ప్రత్యేక డీలక్స్ సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. సత్తుపల్లి–ఖమ్మం మార్గంలో నడిచే ఈ డీలక్స్ బస్సులకు వీఎం బంజర, కల్లూరు, వైరా వద్ద మాత్రమే స్టాపులు కల్పించినట్లు తెలిపారు. దీంతో సత్తుపల్లి నుంచి ఖమ్మం, ఖమ్మం నుంచి సత్తుపల్లికి ప్రయాణించే వారికి సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు.

**బస్సుల వివరాలు..**




సత్తుపల్లి నుంచి ఖమ్మం వైపు ఉదయం 7, 7.30, 8 గంటలకు, మధ్యాహ్నం 11.45, 12.15, ఒంటి గంటలకు, సాయంత్రం 4.30, 5, 5.40 గంటలకు బస్సులు బయలుదేరనున్నాయని పేర్కొన్నారు. అలాగే ఖమ్మం నుంచి సత్తుపల్లి వైపు ఉదయం 9.20, 9.45, 10.15 గంటలకు, మధ్యాహ్నం 2.15, 2.50, 3.30 గంటలకు, సాయంత్రం 6.40, 7.15, 8 గంటలకు డీలక్స్ బస్సులు నడుస్తాయని తెలిపారు. సత్తుపల్లి డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ ప్రత్యేక సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**నేరడిగొండ:** ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆరోగ్య పర్యవేక్షకులు ఎ.సంతోష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'పీఎం జన్మన్'క్యాంపెయిన్ లో భాగంగా బుధవారం మండలంలోని బోరిగాం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. శిబిరంలో స్థానిక ప్రజలకు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బోరిగాం సర్పంచ్ రాథోడ్ వినీష్, పిఎస్. మనోహర్, ఆశా కార్యకర్త కమల, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ కు సన్మానం



**ఆదిలాబాద్:** బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్గా వరుసగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన మల్లెపూల సత్యనారాయణను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సంజీవరెడ్డి మాట్లాడుతూ మల్లెపూల సత్యనారాయణ నాయకత్వంలో బోథ్ మార్కెట్ కమిటీ మరింత అభివృద్ధి సాధిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. వరుసగా రెండోసారి చైర్మన్గా బాధ్యతలు చేపట్టడం ఆయన సమర్థతకు నిదర్శనమని కొనియాడారు. రైతులకు మార్కెట్ కమిటీ ద్వారా మెరుగైన సేవలు అందేలా పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. అనంతరం మల్లెపూల సత్యనారాయణను శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు అంబకంటి అశోక్ కుమార్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, బోరిగాం సర్పంచ్ ఆసిఫ్ ఖాన్, యాకూబ్తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంచార్జిల పాలనతో కల్లూరు పశువైద్య కేంద్రం అస్తవ్యస్తం

శాశ్వత వైద్యుడు లేక పాడి రైతుల అవస్థలు




**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా కల్లూరు డివిజన్ కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో గత మూడు సంవత్సరాలుగా శాశ్వత వైద్యుడు లేకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఇంచార్జి వైద్యులతోనే సేవలు కొనసాగుతుండటంతో పశువులకు సమయానికి చికిత్స అందక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్యానికి గురయ్యే పశువులను చికిత్స కోసం కేంద్రానికి తీసుకువస్తున్నప్పటికీ సరైన వైద్య సేవలు అందడం లేదని వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. దీంతో అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశువైద్య కేంద్రంలో సిబ్బంది కొరతతో పాటు అవసరమైన మందులు కూడా సరిపడా లేవని ఆరోపించారు. ముఖ్యంగా పాడి పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కల్లూరు పశువైద్య కేంద్రానికి శాశ్వత వైద్యుడిని నియమించి, పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని పాడి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## అస్వస్థతకు గురైన ఉపాధిహామీ మహిళా కూలి




**తాండూర్:** తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల వద్ద బుధవారం మహిళా కూలి అస్వస్థతకు గురైంది. గ్రామానికి చెందిన ఆడే సతమ్మ పని ప్రారంభానికి ముందు అకస్మాత్తుగా హైబీపీ కారణంగా అస్వస్థతకు గురయ్యారు. విషయం గమనించిన ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్థులు వెంటనే స్పందించి ఆమెను సమీప ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించేలా చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్ ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కూలీలకు ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో తగినంత నీరు తాగుతూ, మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకుంటూ పనులు చేయాలని అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది మాట్లాడుతూ పని స్థలాల్లో కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## చిన్నారులకు టీకాలు వేయించాలి



**సత్తుపల్లి:** చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఎంఎల్హెచ్పీ శ్రీహర్ష అన్నారు. వేంసూరు మండలంలోని వెంకటాపురం గ్రామ పల్లె దవాఖానలో బుధవారం చిన్నారులకు టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులు అత్యవసర పరిస్థితులు తప్పా బయటకు రాకుండా ఉండాలని అన్నారు. శరీరంలో నీరసం రాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను నీటిలో కలుపుకుని తాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ శ్రీనివాస రావు, షబ్నం, ప్రమీల, సుమలత, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

# పప్పు దినుసులను తిన్న తరువాత జీర్ణ సమస్యలు వస్తున్నాయా.. అయితే వాటిని ఇలా తీసుకోండి..



పప్పులు భారతీయ ఆహారంలో కీలక భాగంగా ఉంటాయి. ఇవి ప్రోటీన్, ఫైబర్, అవసరమైన పోషకాలతో నిండి ఉండడంతో రోజువారీ భోజనంలో ఎక్కువగా వాడుతుంటారు. అయితే పప్పులు తిన్న తర్వాత కొందరికి పొట్ట ఉబ్బరం, బరువుగా అనిపించడం, గ్యాస్ వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. అయితే దీనికి పప్పులు కారణం కాకపోవచ్చని, వాటిని సరైన విధంగా సిద్ధం చేయకపోవడమే ప్రధాన కారణమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పప్పులు వండే ముందు నానబెట్టడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. అయితే అన్ని రకాల పప్పులకు ఒకే విధమైన నానబెట్టే సమయం సరిపోదని చెబుతున్నారు. ఏ పప్పును ఎంతసేపు నానబెట్టాలో తెలుసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు పొట్ట ఉబ్బరం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉందని వివరిస్తున్నారు.

**రాత్రంతా నానబెట్టడం మంచిది..**

చిన్న పరిమాణంలో ఉండే పూర్తి గింజల పప్పులు ఇతర పెద్ద లెగ్యూమ్స్‌తో పోలిస్తే తేలికగా జీర్ణమవుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని సుమారు 7 నుంచి 8 గంటలు, ముఖ్యంగా రాత్రంతా కొద్దిగా ఉప్పు వేసి నానబెట్టడం మంచిదని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల పప్పులు మెత్తబడటంతో పాటు వండటానికి సులభమవుతాయి. జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుందని చెబుతున్నారు. అలాగే రాజ్మా, శనగలు, చోలే వంటి పెద్ద లెగ్యూమ్స్‌కు మరింత సమయం అవసరమని చెబుతున్నారు. వీటి పై పొర గట్టిగా ఉండటంతో జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అందువల్ల ఇవి గ్యాస్, పొట్ట ఉబ్బరం వంటి సమస్యలకు కారణమవుతాయని వివరిస్తున్నారు. కనీసం 10 నుంచి 12 గంటల పాటు రాత్రంతా నానబెట్టాలని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల జీర్ణానికి ఇబ్బంది కలిగించే కొన్ని సంయోగాలు తగ్గిపోతాయని అంటున్నారు.

**పొట్టు తీస్తే ఎక్కువ సేపు అవసరం లేదు..**

అలాగే పొట్టు తీసిన రకాలైన కందిపప్పు, మినప పప్పు వంటి వాటికి ఎక్కువసేపు నానబెట్టాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. వీటిలో బయటి పొర లేకపోవడంతో ఇవి తేలికగా జీర్ణమవుతాయని పేర్కొంటున్నారు. సుమారు 4 నుంచి 5 గంటలు నానబెట్టడం సరిపోతుందని సూచిస్తున్నారు. పప్పులు నానబెట్టడం ఒక ఎంపిక కాదు, తప్పనిసరి అలవాటు కావాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడటంతో పాటు గట్ ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలియజేస్తున్నారు. ఈ చిన్న అలవాటు వల్ల పొట్ట ఉబ్బరం తగ్గడం, పోషకాలు శరీరానికి మెరుగ్గా అందడం, భోజనం తిన్న తర్వాత తేలికగా అనిపించడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని సూచిస్తున్నారు. పప్పులు తిన్నప్పుడు జీర్ణ సమస్యలు వస్తున్నాయని భావించే వారు ముందుగా వాటిని నానబెట్టే విధానాన్ని పరిశీలించుకోవాలని చెబుతున్నారు.

# వేసవిలో ముఖంపై అధికంగా కనిపించే వైట్ హెడ్స్.. కారణాలు ఏంటి.. ఏం చేయాలి..?



వేసవి కాలంలో ముక్కుపై చిన్న చిన్న తెల్లని మొటిమలు ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. ఈ సమస్యను చాలా మంది ఎదుర్కోనే ఉంటారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో చర్మంలో ఆయిల్ ఉత్పత్తి కూడా అధికమవుతుంది. దీంతో ముఖ్యంగా ముక్కు భాగంలో వైట్‌హెడ్స్ ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి సాధారణ మొటిమల్లా కనిపించినా, సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇన్‌ఫ్లమేటరీ యాక్నేగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. వైట్‌హెడ్స్ అనేవి చర్మ రంధ్రాలు ఆయిల్, మృత చర్మ కణాలు, బ్యాక్టీరియాతో మూసుకుపోయినప్పుడు ఏర్పడతాయి. బ్లాక్‌హెడ్స్‌లా బయటకు తెరిచి ఉండకపోవడంతో ఇవి తెల్లని లేదా చర్మరంగు గడ్డల్లా కనిపిస్తాయి. ముఖ్యంగా వేసవిలో వేడి, చెమట, తేమ కలిసి ఈ సమస్యను మరింత పెంచుతాయి. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా చర్మంలోని సెబేషియస్ గ్రంథులు ఎక్కువగా ఆయిల్ ను విడుదల చేస్తాయి. ఈ అదనపు ఆయిల్ దుమ్ము, మృత కణాలతో కలిసిపోవడంతో రంధ్రాలు సులభంగా మూసుకుపోతాయి. ఫలితంగా ముక్కుపై వైట్‌హెడ్స్ ఎక్కువగా కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. చెమట కూడా ఈ సమస్యలో కీలక పాత్ర పోషిస్తుంది. శరీరాన్ని చల్లబరచడానికి చెమట అవసరమే అయినప్పటికీ, అధిక తేమ ఉన్న వాతావరణంలో అది సరిగా ఆవిరి కాక చర్మంపై మలినాలను బంధిస్తుంది. దీని వల్ల పోర్స్ మరింత బ్లాక్ అయ్యే అవకాశాలు పెరుగుతాయి. ముఖ్యంగా ముక్కు భాగం టీ-జోన్ లో ఉండటంతో అక్కడ ఆయిల్ గ్రంథులు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల ముక్కు భాగం సహజంగానే ఎక్కువ ఆయిలీగా ఉంటుంది. పైగా అక్కడి రంధ్రాలు కొంచెం పెద్దవిగా ఉండటం వల్ల మలినాలు త్వరగా పేరుకుపోయి మొటిమలకు దారితీస్తాయని చర్మ నిపుణులు వివరిస్తున్నారు. అలాగే ముఖాన్ని పదేపదే చేతులతో తాకడం, చెమట తుడుచుకోవడం కూడా బ్యాక్టీరియా వ్యాప్తికి కారణమవుతుంది. ఇది వైట్‌హెడ్స్‌ను మరింత తీవ్రమయ్యేలా చేస్తుందని చెబుతున్నారు. వైట్‌హెడ్స్ నివారణకు కఠినమైన ట్రీట్మెంట్స్ కంటే మృదువైన, క్రమబద్ధమైన చర్మ సంరక్షణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు రెండు సార్లు మైల్డ్ క్లెన్సర్‌తో ముఖాన్ని శుభ్రం చేయడం ద్వారా అదనపు ఆయిల్, దుమ్ము తొలగించవచ్చు.

# ప్రీడయాబెటిస్ ఉన్నవారికి విటమిన్ డి ఇస్తే మెరుగైన ఫలితాలు.. అధ్యయనంలో వెల్లడి..




ప్రస్తుత కాలంలో భారతదేశంలో ప్రీడయాబెటిస్ సమస్య వేగంగా పెరుగుతోంది. ఐసీఎంఆర్-ఇండియాబ్ అధ్యయనం ప్రకారం దేశ జనాభాలో సుమారు 15.3 శాతం మంది ప్రీడయాబెటిస్‌తో బాధపడుతున్నారు. ఇది దాదాపు 13.6 కోట్ల మందికి సమానం. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఈ పరిస్థితి టైప్-2 డయాబెటిస్‌గా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిక మోతాదులో విటమిన్-డి సప్లిమెంట్లు కొంతమందిలో డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తాయని తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ పరిశోధనను అమెరికాలోని టఫ్ట్స్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించారు. అధ్యయన ఫలితాలు జామా నెట్‌వర్క్ ఓపెన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

**రోజుకు ఎంత మోతాదులో ఇస్తే..**

పరిశోధకులు ముందుగా నిర్వహించిన డి2డి ట్రయల్ డేటాను మళ్లీ విశ్లేషించారు. ఇందులో పాల్గొన్న పెద్దలకి రోజుకు 4,000 ఐయూ విటమిన్-డి లేదా ప్లాసీబోను సుమారు రెండున్నరేళ్ల పాటు ఇచ్చారు. మొదటి దశలో జరిగిన డి2డి అధ్యయనంలో పాల్గొన్నవారిలో డయాబెటిస్ ప్రమాదం తగ్గినట్టు స్పష్టమైన ఫలితాలు కనిపించలేదు. అయితే తాజా విశ్లేషణలో కొన్ని ప్రత్యేక జన్యు లక్షణాలు ఉన్నవారికి విటమిన్-డి వల్ల ప్రయోజనం కలిగినట్టు గుర్తించారు. ఈ పరిశోధనలో భాగంగా 2,098 మంది పాల్గొన్నవారి డీఎన్ఏ నమూనాలను పరీక్షించారు. ముఖ్యంగా విటమిన్-డి రిసెప్టర్ (వీడీఆర్) జీన్లలో ఉండే మూడు సాధారణ వేరియంట్లను పరిశీలించారు. రక్త పరీక్షల ద్వారా ఫాస్టింగ్ గ్లూకోజ్ 126 ఎంజీ/డీఎల్ కంటే ఎక్కువగా ఉండటం, రెండు గంటల తర్వాత గ్లూకోజ్ 200 ఎంజీ/డీఎల్ దాటడం లేదా హెచ్‌బీఏ1సీ 6.5 శాతానికి మించితే డయాబెటిస్‌గా నిర్ధారించారు. అధ్యయనం ప్రకారం వీడీఆర్ జీన్‌లో ఏపాల్ ప్రాంతంలో ఏసీ లేదా సీసీ రకాల వేరియంట్లు ఉన్నవారిలో విటమిన్-డి సప్లిమెంట్లు తీసుకున్నప్పుడు డయాబెటిస్ ప్రమాదం సుమారు 19 శాతం వరకు తగ్గినట్టు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 శాతం మందిలో ఈ వేరియంట్లు ఉండే అవకాశముందని పరిశోధకులు చెబుతున్నారు.

**అందరికీ వర్తించదు..**

అయితే ఏఏ వేరియంట్ ఉన్నవారిలో మాత్రం ఈ ప్రయోజనం కనిపించలేదని వెల్లడించారు. విటమిన్-డి శరీరంలో ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్యాంక్రియాస్‌లో ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాల్లో విటమిన్-డి రిసెప్టర్ ప్రోటీన్లు ఉంటాయి. ఇవి యాక్టివ్ విటమిన్-డితో కలిసి పనిచేస్తాయి. అయితే జీన్‌లలో ఉండే మార్పుల వల్ల ఈ ప్రక్రియ ప్రభావితం అవుతుందని పరిశోధకులు వివరిస్తున్నారు. అధ్యయనంలో ఉపయోగించిన 4,000 ఐయూ విటమిన్-డి మోతాదు సాధారణంగా సూచించే రోజువారీ 600 నుంచి 800 ఐయూ కంటే చాలా ఎక్కువ. అయినప్పటికీ ట్రయల్ సమయంలో తీవ్రమైన దుష్ప్రభావాలు కనిపించలేదని పరిశోధకులు పేర్కొన్నారు.

**వైద్యుల సలహా లేకుండా వద్దు..**

అయితే వైద్యుల సలహా లేకుండా అధిక మోతాదులో విటమిన్-డి ని తీసుకోవద్దని హెచ్చరిస్తున్నారు. అధికంగా తీసుకుంటే విటమిన్-డి టాక్సిసిటీ ప్రమాదం ఉంటుందని సూచిస్తున్నారు. భవిష్యత్తులో ప్రీడయాబెటిస్ ఉన్నవారిలో ఎవరికి విటమిన్-డి సప్లిమెంట్లు ఎక్కువ ప్రయోజనం ఇస్తాయో జన్యు పరీక్షల ద్వారా ముందుగానే గుర్తించే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. ఇది వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్సలు అందించే పర్సనలైజ్డ్ మెడిసిన్ దిశగా ఒక ముందడుగుగా భావిస్తున్నారు. అయితే నిపుణులు జీవనశైలినే అత్యంత కీలక అంశంగా పేర్కొంటున్నారు. సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, యోగా, బరువు నియంత్రణ వంటి అలవాట్లు డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు. విటమిన్-డి సప్లిమెంట్లు కొన్ని జన్యు లక్షణాలు ఉన్నవారికి అదనపు రక్షణగా ఉపయోగపడే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

# కేక్‌ల మీద వాడే క్రీమ్ డెయిరీనా, నాన్-డెయిరీనా అని తెలుసుకోవడం ఎలా..



పిల్లలతో పాటు పెద్దలు కూడా ఇష్టంగా తినే వాటిల్లో కేక్ ఒకటి. ప్రతి శుభకార్యంలో ఇప్పుడు కేక్ కట్టింగ్ తప్పనిసరైందని చెప్పవచ్చు. అయితే కేక్‌పై ఉండే క్రీమ్ నిజమైన డెయిరీ క్రీమా, లేక నాన్-డెయిరీ క్రీమా అనే సందేహం చాలా మందికి వస్తుంటుంది. బయటకు చూస్తే రెండూ ఒకేలా కనిపించినా, రుచి, టెక్స్చర్, తయారీ విధానం పరంగా ఇవి పూర్తిగా భిన్నమని ఫుడ్ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా భారతీయ బేకరీల్లో ఎక్కువగా ఉపయోగించే నాన్-డెయిరీ క్రీమ్ గురించి తెలుసుకోవడం వినియోగదారులకు ఉపయోగకరమని సూచిస్తున్నారు. సాధారణంగా విప్డ్ డెయిరీ క్రీమ్ ఆవు పాలతో తయారవుతుంది. ఇందులో కనీసం 30 శాతం వరకు పాల కొవ్వు ఉంటుంది. ఈ ఫ్యాట్ కారణంగానే క్రీమ్‌కు మృదువైన టెక్స్చర్, క్రీమీ ఫీలింగ్ వస్తాయి. విప్ చేసినప్పుడు గాలిని పట్టుకుని లైట్‌గా, ఫ్లఫీగా మారుతుంది. బ్రాండెడ్ బేకరీల్లో కనిపించే సాఫ్ట్ క్రీమ్ కేక్‌లలో సాధారణంగా ఇలాంటి డెయిరీ క్రీమ్ ఉపయోగిస్తారు.

**తేడా ఏమిటి..**

మరోవైపు నాన్-డెయిరీ క్రీమ్ పూర్తిగా వేరే ఉత్పత్తి. ఇది సాధారణంగా నీరు, హైడ్రోజనేటెడ్ వెజిటబుల్ ఆయిల్, కార్న్ సిరప్, స్టెబిలైజర్స్, ఎమల్సిఫైయర్స్ వంటి పదార్థాలతో తయారవుతుంది. ఇది డెయిరీ క్రీమ్‌లా కనిపించేందుకు ప్రత్యేకంగా తయారు చేస్తారు. అయితే ఇది సహజ పాల ఉత్పత్తి కాదని నిపుణులు వివరిస్తున్నారు. దేశంలో ఎక్కువ బేకరీలు నాన్-డెయిరీ క్రీమ్‌ను ఉపయోగించడానికి ప్రధాన కారణం వాతావరణమే. అధిక ఉష్ణోగ్రతల్లో డెయిరీ క్రీమ్ త్వరగా కరుగుతుంది. కానీ నాన్-డెయిరీ క్రీమ్ ఎక్కువసేపు ఆకారాన్ని నిలుపుకుంటుంది. కేక్ డెకరేషన్స్, డిజైన్స్ కూడా స్పష్టంగా కనిపిస్తాయి. డెలివరీ సమయంలో కూడా ఇది సులభంగా చెడిపోదు. కేక్‌పై ఉన్న క్రీమ్ ఏ రకమో కొన్ని లక్షణాల ద్వారా గుర్తించవచ్చని చెబుతున్నారు. డెయిరీ క్రీమ్ సాధారణంగా తేలికగా, మైల్డ్ స్వీట్‌గా ఉంటుంది. నోట్లో వేసుకున్న వెంటనే కరిగిపోతూ పాల రుచిని ఇస్తుంది. తిన్న తర్వాత ఆయిలీ ఫీలింగ్ ఉండదు. అదే నాన్-డెయిరీ క్రీమ్ అయితే ఎక్కువ తీపిగా ఉండటంతోపాటు కొంచెం ఆర్టిఫిషియల్ రుచి వస్తుంది. కొందరికి ఇది మైనం లాంటి లేదా ఆయిలీ ఫీలింగ్ ఇస్తుంది. తిన్న తర్వాత నాలుకపై కొద్దిసేపు కొవ్వు పొర ఉన్నట్టుగా అనిపిస్తుంది.

**రూపాన్ని చూసి చెప్పవచ్చు..**

క్రీమ్ రూపాన్ని చూసి కూడా కొంతవరకు అంచనా వేయొచ్చని చెబుతున్నారు. డెయిరీ క్రీమ్ కొంచెం మ్యాట్ ఫినిష్‌లో కనిపిస్తుంది. పైపింగ్ డిజైన్లు సాఫ్ట్‌గా ఉంటాయి. నాన్-డెయిరీ క్రీమ్ మాత్రం ఎక్కువ గ్లోసీగా, ప్లాస్టిక్ లుక్‌తో కనిపిస్తుంది. కేక్‌పై డిజైన్లు కూడా చాలా షార్ప్‌గా, గట్టిగా కనిపిస్తాయి. చేతికి తగిలినప్పుడు కూడా తేడా తెలుస్తుంది. డెయిరీ క్రీమ్ శరీర వేడితో త్వరగా కరుగుతుంది. నాన్-డెయిరీ క్రీమ్ మాత్రం కొంత గట్టిగా, మైనంలా ఉండి త్వరగా కరగదు. ప్యాకేజ్డ్ కేక్‌లలో అయితే ఇన్‌గ్రిడియెంట్స్ లిస్ట్ చూసి తెలుసుకోవచ్చు. క్రీమ్, డెయిరీ క్రీమ్ వంటి పదాలు ఉంటే అది పాల ఆధారిత క్రీమ్ అయ్యే అవకాశం ఉంది. వెజిటబుల్ ఫ్యాట్, నాన్-డెయిరీ టాపింగ్, పామ్ ఆయిల్, స్టెబిలైజర్స్ వంటి పదాలు ఉంటే అది నాన్-డెయిరీ క్రీమ్ అయ్యే అవకాశాలు ఉంటాయి. అయితే ఈ రెండింటిలో ఏదీ పూర్తిగా చెడు కాదు అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. డెయిరీ క్రీమ్ సహజమైన రుచి ఇస్తే, నాన్-డెయిరీ క్రీమ్ ఎక్కువ స్థిరత్వం కలిగి ఉంటుంది. ముఖ్యంగా లాక్టోజ్ అసహనం ఉన్నవారికి లేదా వెగన్ ఆహారం తీసుకునేవారికి నాన్-డెయిరీ క్రీమ్ ఉపయోగకరంగా ఉంటుంది. కేక్ కొనేటప్పుడు ఫ్రెష్ క్రీమ్ అంటే నిజంగా ఏ క్రీమ్ వాడుతున్నారో బేకరీని నేరుగా అడగడం మంచిది. రుచి, టెక్స్చర్, రూపం, లేబుల్ వంటి విషయాలను గమనిస్తే డెయిరీ, నాన్-డెయిరీ క్రీమ్‌ల మధ్య తేడాను సులభంగా గుర్తించవచ్చు.



# అవధానంలో అసమాన ప్రతిభుడు రాళ్లబండి

## నేడు రాళ్లబండి కవితాప్రసాద్ జయంతి

తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించిన ప్రసిద్ధ సాహితీవేత్త, అవధాన చక్రవర్తి రాళ్ళబండి కవితా ప్రసాద్. ఒకవైపు ఉద్యోగ రంగంలో సమర్థ అధికారిగా పేరు తెచ్చుకుంటూనే, మరో వైపు కవితా క్షేత్రంలో అందెవేసిన చేయిగా, అవధాన ప్రక్రియలో అసమాన ప్రతిభునిగా, నిర్విరామ సాధనలో సాటిలేని మేటిగా వినుతికెక్కిన నిరంతర కృషీవలుడు రాళ్ళబండి. అవధాన విద్యలో పరిపూర్ణత్వం కోసం అంకిత భావంతో చిత్తశుద్ధితో ధృఢ సంకల్పంతో శ్రమించి సిద్ధి పొందిన తాపసి ఆయన. కవిత్వం పట్ల మోజుతో తన పేరును తల్లిదండ్రులు పెట్టిన వేంకటేశ్వర ప్రసాద్ పేరును కవితా ప్రసాద్‌గా మార్చుకున్న కవితాభిమాని కవితా ప్రసాద్.

సాంప్రదాయ అవధానానికి ఆధునిక పోకడలను నేర్పిన రాళ్ళబండి కవితా ప్రసాద్ కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం నెమలిలో 1961 మే 21న జన్మించారు. కవితా ప్రసాద్ నెమలిలో పదవ తరగతి వరకు చదివారు. తండ్రి కోటేశ్వరరాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో తరచూ బదిలీ అయ్యేవారు. ఆ క్రమంలో సత్తుపల్లిలో కవితా ప్రసాద్ డిగ్రీ చేశారు. అవధాన విద్య ఆరంభ వికాసాలపై ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు. అనంతర కాలంలో ఇదే యునివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ పొందారు.

కవితాప్రసాద్ చిన్నప్పటి నుంచే సాంస్కృతిక రంగం పట్ల ఆసక్తి కనబరిచారు. అవధాన విద్య పట్ల మక్కువ పెంచుకొని జీవితకాలం ఆ ప్రక్రియలో రాణించారు. దాదాపు 500కి పైగా అవధాన సభలను ఆయన నిర్వహించారు. అష్టావధానం, శతావధానం, ద్విశతావధానం, నవరసావధానం, తదితర విశిష్టమైన, అతి క్లిష్టమైన దశలను సమర్థంగా పరిచయం తెలుగు సాహితీ లోకానికి చేశారు. తెలుగు నేలపై గుబాళించిన ఈ ప్రాచీన సాహితీ ప్రక్రియలను ఎల్లలు దాటించారు. అమెరికాలోని తెలుగు భాషా, సాహితీ ప్రియులు ఆయన కోసం ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేశారు. ఈ కృషిలో కొంత ఆయన జీవితకాలం లోనే గ్రంథస్థం అయింది. అలా ఒంటరి పూలబుట్ట, పద్మ మంటపం, అగ్నిహింస, ఇది కవి సమయం తదితర సంపుటులను వెలువరించారు.

ఆధునిక నృత్య రూపక ప్రక్రియలో పంచకన్య, పంచకావ్యాలను రచించారు. ఈ రూపకాలను 24 గంటల్లోనే సిద్ధం చేసి ప్రముఖ నృత్య కారిణి మంజు భార్గవితో ప్రదర్శింపజేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది.

కవితాప్రసాద్ కృష్ణా జిల్లా, గంపలగూడెం మండలం, నెమలి గ్రామంలో 1961, మే 21వ తేదీన జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు వేంకటేశ్వర ప్రసాదరాజు. కవిత్వం పట్ల మోజుతో తన పేరును కవితా ప్రసాద్‌గా మార్చుకున్నారు. తండ్రి కోటేశ్వర రాజు తెలుగు పండితులు. తల్లి పేరు రత్నవర్ధనమ్మ. సత్తుపల్లిలో గణితశాస్త్రం ఐచ్ఛిక అంశంగా పట్టభద్రులయ్యారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో అవధాన విద్యపై మసన చెన్నప్ప పర్యవేక్షణలో పిహెచ్‌డి చేశారు.

కవితా ప్రసాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చాలా తక్కువ మంది చేసే అవధాన విద్య మీద పి.హెచ్.డి పూర్తిచేశారు. ఒక పక్క గ్రూప్ 1 ప్రభుత్వ అధికారిగా ఉద్యోగం చేస్తూనే... మరోపక్క తనకెంతో ఇష్టమైన తెలుగు సాహిత్యంలో శిఖరాలను అందుకున్నారు. ఆశించిన గమ్యాన్ని చేరుకున్నారు. ఆయన 500కు పైగా అవధానాలను నిర్వహించారు. వాటిలో అష్టావధానాలతో పాటుగా శతావధానాలు, ద్విశతావధానాలు ఉన్నాయి. సంప్రదాయ అవధానంతో పాటు కథ, వచన కవిత, గణితం వంటి అనేక ప్రక్రియలను అవధానంలో చొప్పించారు. ఒక సందర్భంలో 25 నిమిషాలలో విచిత్ర అష్టావధానం చేసి అసమాన ప్రతిభను ప్రదర్శించారు. పండితుల మెప్పు పొందారు.

వరంగల్‌లోని భద్రకాళి దేవాలయంలో ఏకదిన శతకరచన ధార అనే కార్యక్రమాన్ని చేపట్టి ఒకే రోజులో ఆశువుగా శతకాన్ని చెప్పారు. ఆశుకవితా ఝరి పేరుతో గంటకు 500 పద్యాలు ఆశువుగా చెప్పి ఔరా అనిపించు కున్నారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-1 అధికారిగా సాంఘిక సంక్షేమ శాఖలో వివిధ రకాల సేవలను అందించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖలో సుదీర్ఘ కాలం సాంస్కృతిక విభాగంలో అనేక హోదాల్లో సేవలు అందించారు. రెండు పర్యాయాలు సంచాలకులుగా పనిచేశారు. ఆయన పర్యవేక్షణలో నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు తిరుపతిలో జరిగాయి. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శిగా ఆయన పనిచేశారు. ఆ కాలంలో 'సప్తగీతధామ', 'కవిసార్వభౌమ' పేరిట వేంకటేశ్వర సంకీర్తనలను రచించి సీడీ రూపంలో అందించారు. దాదాపు పాతికేళ్ల తరువాత ప్రతిష్టాత్మకంగా జరిగిన మహాసభలకు సమన్వయ కర్తగా వ్యవహరించారు. నాటి రాష్ట్ర మంత్రి కడియం శ్రీహరి వద్ద పీయస్ గా బాధ్యతలు నిర్వర్తించారు. కవితా ప్రసాద్ 2015 మార్చి 15న హైదరా బాదులో హృద్రోగంతో మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# నవలా సాహిత్య సామ్రాజ్ఞి.. సులోచనారాణి

## నేడు యద్దనపూడి సులోచనారాణి వర్ధంతి

యద్దనపూడి సులోచనారాణి. తెలుగు ప్రజలకు పరిచయం అవసరం లేని పేరు. దశాబ్దాల పాటు తెలుగు నవలా పాఠకులకు, తెలుగు సినిమా ప్రేక్షకులకు అభిమాన రచయిత్రి. తెలుగు నవలా సామ్రాజ్యాన్ని ఐదు దశాబ్దాల పాటు ఏలిన సాహిత్య సామ్రాజ్ఞి. ఆమె నవలల్లో సహజత్వం ఉట్టి పడుతుంది. ఆమె పాత్రలలో సజీవత్వం తొణికిస లాడుతుంది. పెళ్ళికాని యువతలో, గృహిణుల్లోనూ పాఠక శక్తిని పెంపొందించిన ఘనత ఆమెకే దక్కింది. మధ్యతరగతి కుటుంబ పరిస్థితులే ఆమె పాత్రల నేపద్యం కాగా, యువతీ యువకుల నుండి వయసు మళ్లిన వారి వరకు ఆమె అభిమాన రచయిత్రిగా మారారు. ఆధునిక జీవనశైలి కి భిన్నమైన, చర్విత చర్వణంగా దినచర్యలు కలిగిన నాటి పరిస్థితులలో రేడియో కార్యక్రమాలు వినడం, నవలలు చదవడం, అప్పుడప్పుడూ సినిమాలు చూడడం సర్వత్రా చోటు చేసుకున్న కాలంలో యద్దనపూడి నవలలు వయసు తో నిమిత్తం లేకుండా నిత్య పఠనాసక్తిని కలిగించాయి అంటే ఆమె రచనా వ్యాసంగం ఎంతటి ప్రభావాన్ని పాఠక లోకంపై చూపిందో స్పష్టం అవుతున్నది. చర్విత చర్వణం లా సాగే నాటి ప్రజా జీవన విధానాన్ని జాగ్రత్తగా గమనించి, తను పరిశీంచిన జీవితాలను కథా వస్తువులుగా తీసుకొని, పాఠకులకు నచ్చిన రీతిలో ఆమె రచనలు చేశారు. మధ్యతరగతి అమ్మాయిల ఊహలు, అంతరంగానికి, ఆశలకు, స్వాభిమానానికి యద్దనపూడి నవలలు అద్దంపడతాయని నాటి పాఠకులు భావించేవారు. అమ్మాయిల ఆత్మాభిమానం, తల వంచని వ్యక్తిత్వం, ఆత్మ విశ్వాసం, హుందాతనం, మాటకారితనం ప్రతి ఆడ పాత్రలో కనిపిస్తాయి. ప్రతివారి హృదయాలకు హత్తుకునేలా పాత్రల సృష్టి చేశారు. ఆలుమగల మధ్య ప్రేమలు, కుటుంబ కథనాలు రాయడంలో తనకు వేరెవరూ సాటిరారని నిరూపించారు. అందుకే ఆమె రాసిన నవలల ఆధారంగా అనేక



సినిమాలు తీసినా అవి నేటికీ అద్భుత చిత్రాలుగా మన గలుగు తున్నాయి. అలాగే ఆమె రచనలు కేవలం సినిమాలు గానే కాక అనేక టీ.వీ. ధారా వాహికలుగా రూపొందించ బడ్డాయి.

1940లో ఏప్రిల్ 2న కృష్ణాజిల్లా మొవ్వ మండలంలోని కాజా గ్రామంలో జన్మించిన యద్దనపూడి సులోచనారాణి తొలిసారిగా చదువుకున్న అమ్మాయిలు చిత్రం ద్వారా సినీ ప్రపంచంలోకి అడుగు పెట్టారు. 1965లో మనుషులు – మమతలు సినిమాకు కథను అందించారు. తర్వాత వీరు రాసిన మీనా, జీవన తరంగాలు, సెక్రటరీ, రాధాకృష్ణ, అగ్నిపూలు, చండీప్రియ, ప్రేమ లేఖలు, విచిత్ర బంధం, బంగారు కలలు లాంటి నవలలు చలన చిత్రాలుగా వచ్చాయి. అయితే సెక్రటరీ మాత్రం ఓ అద్భుత ట్రెండ్ సెట్టర్ గా మిగిలి పోయింది. ఆ రోజుల్లో ప్రతి యువకుడు ఓ రాజశేఖరంలా ప్రతి యువతీ ఆత్మాభిమానం గల జయంతిలా ఉండాలనుకునే వారు. 1965 లో మార్కెట్ లోకి వచ్చి సంచలనం సృష్టించింది సెక్రెటరీ నవల. 20 వ శతాబ్దపు బెస్ట్ సెల్లర్ ఏకంగా 75 ముద్రణలు చేసుకున్న నవల ఇది. సీరియల్స్ గా వచ్చినపుడు పాఠకులను మంత్ర ముగ్ధులను చేసేవి కొన్ని నవలలు. సెక్రటరీ, జీవన తరంగాలు, మీన్న, విజేత, ఆరాధన, కీర్తి కిరీటాలు, ప్రేమ లేఖలు, గిరిజా కల్యాణం, పార్థు, ఈ తరం కథ, ఆత్మీయులు, బంగారు కలలు, కథల్లో బహుమతి, ఐలవ్ యూ... ఇంకా ఎన్నో ఆమె అభిమానులు మెచ్చినవి. ఎన్ని సార్లు ప్రచురించినా, అన్ని ప్రతులూ అతి వేగంగా అమ్ముడు పోయేవి. సులోచనా రాణి శైలి అమోఘం, అనన్యం, అపూర్వం, అనితర సాధ్యం. మీనా, జీవన తరంగాలు, సెక్రటరీ, రాధాకృష్ణ, అగ్నిపూలు, చండీప్రియ, ప్రేమలేఖలు, బంగారు కలలు, విచిత్ర బంధం, జై జవాన్, ఆత్మ గౌరవం తదితర నవలలను సినిమాలుగా తీశారు.

యద్దనపూడి సులోచనారాణి వయస్సు మళ్లిన ఒంటరి మహిళల కోసం 'విన్' పేరుతో వృద్ధాశ్రమాన్ని నెలకొల్పారు. దాదాపు ఏడేళ్ల పాటు ఆశ్రమాన్ని నిర్వహించారు కూడా. అనారోగ్య సమస్యలు తలెత్తడం వల్ల తన ఆత్మీయులకు హోం బాధ్యతను అప్పగించారు. అనాథ బాలలు, మురికివాడల్లోని పిల్లల కోసం తన ఇంటి ఆవరణ లోనే కొద్ది రోజుల పాటు ప్రత్యేక పాఠశాలను నిర్వహించారు. 'పరాశర' స్వచ్ఛంద సంస్థ ద్వారా అనాథ బాలల వసతి గృహాలు, వయోధికుల ఆశ్రమాలకు బియ్యం, పప్పు వంటి నిత్యావసరాలతో పాటు ఆర్థిక సహాయం అందించారు. సెక్రటరీ 50ఏళ్ల వేడుకలో పది మంది విద్యార్థులకు ఆర్థిక సహకారం ద్వారా చేయూత అందించారు. 2018, మే 21న అమెరికా లోని కాలిఫోర్నియాలో తన కూతురు నివాసంలో గుండె పోటుతో గుండెపోటుతో మృతిచెందారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# రాజీవ్ రక్తంతో రాసుకున్న పాఠం!

## మే 21 దేశాన్ని కుదిపేసిన దారుణం

## తీవ్రవాదానికి బలైన మాజీ ప్రధాని

## ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవంగా నిర్వహణ

దేశ రాజకీయ చరిత్రలో మే 21 ఒక విషాద దినం. భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ తీవ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన రోజు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో ఎన్నికల ప్రచార సభలో ఎల్‌టిటిఈ ఆత్మాహుతి దాడిలో రాజీవ్ గాంధీ హతమయ్యారు. ఆ దారుణ ఘటన దేశాన్ని ఒక్కసారిగా షాక్‌కు గురి చేసింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది మే 21ను "జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం"గా నిర్వహిస్తున్నారు. తీవ్రవాదం ఎంత ప్రమాదకరమో ప్రజలకు తెలియజేయడం, దేశ ఐక్యతను కాపాడడం, హింసకు దూరంగా సహజీవనం చేయాలనే సందేశాన్ని చాటడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజాసంఘాలు దేశవ్యాప్తంగా ఈరోజు ప్రతిజ్ఞా కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి.

### 40 ఏళ్లకే దేశ పగ్గాలు

1944 ఆగస్టు 20న జన్మించిన రాజీవ్ గాంధీ, 1984లో తన తల్లి ఇందిరా గాంధీ హత్య అనంతరం



దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో అత్యంత యువ ప్రధానిగా చరిత్ర సృష్టించారు. ఆధునిక భారత నిర్మాణంలో కంప్యూటర్ విప్లవం, టెలికాం రంగ అభివృద్ధికి పునాది వేసిన నేతగా ఆయన గుర్తింపు పొందారు. 1991 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజీవ్ గాంధీ తమిళనాడులో పర్యటిస్తుండగా శ్రీపెరంబుదూరులో జరిగిన సభలో ఎల్‌టిటిఈకి చెందిన ఆత్మాహుతి దళ సభ్యురాలు "థాను" పూలమాల వేసే నెపంతో ఆయనకు చేరువై తన శరీరానికి కట్టుకున్న ఆర్డీఎక్స్‌ను పేల్చింది. ఆ భారీ పేలుడులో రాజీవ్ గాంధీతో పాటు పలువురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆ దృశ్యాలు దేశాన్ని కుదిపేశాయి. భద్రతా వ్యవస్థలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి కేసును ఛేదించింది. విచారణలో ఎల్‌టిటిఈ కుట్ర బట్టబయలైంది.

### తీవ్రవాదంపై పోరాటానికి ప్రతిజ్ఞ

రాజీవ్ గాంధీ హత్య అనంతరం దేశంలో తీవ్రవాద వ్యతిరేక చర్యలు మరింత కఠినమయ్యాయి. ఉగ్రవాదం మానవత్వానికి శత్రువని, దాన్ని సమూలంగా నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందనే సందేశంతో మే 21ను కేంద్ర ప్రభుత్వం జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం కొత్త రూపాల్లో విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ దినోత్సవ ప్రాధాన్యం మరింత పెరిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. హింస కాదు.. శాంతి, సహనం, ప్రజాస్వామ్యమే దేశ బలం అన్న సందేశాన్ని ఈ రోజు మరోసారి గుర్తుచేస్తోంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# కప్పు టీతో కాసింత ఉల్లాసం!



## నేడు అంతర్జాతీయ టీ దినోత్సవం

## ప్రపంచాన్ని ఒక్కటి చేసిన తేనీటి రుచి

## ఆరోగ్యానికీ.. ఆత్మీయతకీ టీనే చిరునామా

ఉదయం కళ్లు తెరిచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకూ మనిషి జీవితంలో విడదీయరాని భాగంగా మారిపోయింది టీ. అలసటలోనూ, ఆలోచనల్లోనూ, ఆత్మీయ సంభాషణల్లోనూ మొదటి గుర్తుకొచ్చేది ఒక కప్పు తేనీరే. అందుకే ప్రపంచవ్యాప్తంగా టీకి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ ఐక్యరాజ్యసమితి మే 21ను "అంతర్జాతీయ టీ దినోత్సవం"గా ప్రకటించింది. టీ ఉత్పత్తి చేసే దేశాల్లో వినియోగాన్ని పెంచడం, టీ కార్మికుల జీవనోపాధికి మద్దతు ఇవ్వడం, టీ పరిశ్రమను మరింత బలోపేతం చేయడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం.

### చైనా నుంచి ప్రపంచవ్యాప్తంగా

చరిత్ర ప్రకారం క్రీస్తుపూర్వం 2737లో చైనా చక్రవర్తి షెన్‌నంగ్ తొలిసారిగా టీని కనుగొన్నారు. వేడి నీటిలో తేయాకు పడటంతో వచ్చిన రుచి ఆయనకు నచ్చి టీ పుట్టుకకు నాంది పలికిందని చెబుతారు. అనంతరం శతాబ్దాల పాటు టీ ఔషధంగా ఉపయోగించబడింది. తర్వాత ప్రపంచవ్యాప్తంగా పానీయంగా విస్తరించింది. భారతదేశంలో టీ సాగు 19వ శతాబ్దంలో ప్రారంభమైంది. అస్సాం, డార్జిలింగ్, నీలగిరి ప్రాంతాలు ప్రపంచ ప్రఖ్యాత టీ ఉత్పత్తి కేంద్రాలుగా ఎదిగాయి. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద టీ ఉత్పత్తిదారుల్లో ఒకటి.

### భారతీయుడి జీవితంలో టీ

ఒకప్పుడు కాఫీ సంస్కృతి ఎక్కువగా ఉన్నప్పటికీ.. కాలక్రమేణా టీ సామాన్యుడి పానీయంగా మారిపోయింది. తక్కువ ధరలో అందుబాటులో ఉండటం, వివిధ రకాల రుచులు రావడం, వెంటనే ఉల్లాసాన్ని కలిగించడం టీకి మరింత ఆదరణ తెచ్చాయి. ఇప్పుడు ప్రతి వీధిలో టీ స్టాల్ కనిపించడం సాధారణం. ఉద్యోగి నుంచి విద్యార్థి వరకూ, రైతు నుంచి వ్యాపారి వరకూ అందరికీ టీ ఒక భావోద్వేగంగా మారింది.

### రకాలెన్నో.. రుచులెన్నో

ప్రపంచవ్యాప్తంగా టీ అనేక రూపాల్లో అందుబాటులో ఉంది. గ్రీన్ టీ, బ్లాక్ టీ, వైట్ టీ, మసాలా టీ, అల్లం టీ, కహ్వా, ఐస్ టీ, బబుల్ టీ ఇలా రకరకాల టీలు ప్రజాదరణ పొందుతున్నాయి. భారతదేశంలో మసాలా టీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. కాశ్మీర్‌లో కహ్వా, గుజరాత్‌లో మసాలా టీ, దక్షిణాదిలో పాల టీ విస్తృతంగా వినియోగిస్తారు. టీలోని యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి రక్షణ కల్పిస్తాయని నిపుణులు చెబుతున్నారు. గుండె ఆరోగ్యానికి, ఒత్తిడి తగ్గించడంలో, జీర్ణక్రియ మెరుగుపరచడంలో టీ ఉపయోగపడుతుంది. గ్రీన్ టీ బరువు తగ్గించడంలో కూడా సహాయపడుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. అయితే అతిగా టీ సేవించడం వల్ల అసిడిటీ, నిద్రలేమి, ఆకలి మందగించడం వంటి సమస్యలు రావచ్చని హెచ్చరిస్తున్నారు. కాబట్టి పరిమితంగా తీసుకోవడమే మంచిదని సూచిస్తున్నారు.

### టీతోనే ఆత్మీయత

టీ కేవలం పానీయం మాత్రమే కాదు.. అది మనుషులను దగ్గర చేసే బంధం. కుటుంబ సమావేశం కావచ్చు.. స్నేహితుల కబుర్లు కావచ్చు.. రాజకీయ చర్చలైనా కావచ్చు.. ఒక కప్పు టీతోనే మొదలవుతాయి. అందుకే ప్రపంచం ఎంత ఆధునికమవుతున్నా.. "ఒక కప్పు టీ"కి ఉన్న ప్రత్యేక స్థానం మాత్రం ఎప్పటికీ చెరిగిపోదు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494




# భారీగా పెరిగిన బంగారం ధరలు

**హైదరాబాద్, మే 19 :** పసిడి ప్రియులకు మరోసారి షాక్ తగిలింది. గత కొన్ని రోజులుగా స్వల్పంగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు నేడు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. ముఖ్యంగా హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం ధర తులానికి రూ.820 పెరగడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, డాలర్ మారకం విలువల్లో మార్పులు, పెట్టుబడిదారులు మళ్లీ బంగారం వైపు మొగ్గుచూపడం వంటి కారణాలతో పసిడి ధరలు పెరుగుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. నిన్నటివరకు హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,56,220 వద్ద ట్రేడ్ కాగా.. తాజాగా అది రూ.820 పెరిగి రూ.1,57,040కు చేరుకుంది. అదే విధంగా 22 క్యారెట్ల బంగారం ధర రూ.750 పెరిగి రూ.1,43,950 వద్ద కొనసాగుతోంది. ఇక 18 క్యారెట్ల బంగారం ధర కూడా రూ.610 పెరిగి రూ.1,17,780కు చేరింది. పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కొనసాగుతున్న సమయంలో ఈ పెరుగుదల సాధారణ ప్రజలపై అదనపు భారం మోపుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు దాదాపు ఇదే స్థాయిలో నమోదయ్యాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,040గా ఉంది. ఢిల్లీలో ఇది రూ.1,57,190గా ఉండగా.. చెన్నై, మధురై, కోయంబత్తూరులో మాత్రం మరింత ఎక్కువగా రూ.1,62,220 వద్ద కొనసాగుతోంది. దక్షిణ భారత నగరాల్లో బంగారం ధరలు అధికంగా ఉండటం గమనార్హం. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అంతర్జాతీయంగా ఆర్థిక మందగమనం భయాలు, భౌగోళిక ఉద్రిక్తతలు పెరగడం వల్ల పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారాన్ని అధికంగా కొనుగోలు చేస్తున్నారు. దీని ప్రభావం దేశీయ మార్కెట్‌పై కూడా స్పష్టంగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో కూడా ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగవచ్చని బులియన్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా వెండి ధరల్లో కూడా స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. బంగారం ధరలు భారీగా పెరగడంతో నగల కొనుగోలు చేయాలనుకునే వారు కొంతకాలం వేచి చూడాలా లేదా ఇప్పుడే కొనాలా అనే సందిగ్ధంలో ఉన్నారు. ముఖ్యంగా పెట్టుబడిగా బంగారం కొనుగోలు చేసే వారు మార్కెట్ పరిస్థితులను గమనిస్తూ ముందడుగు వేయాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# లాభాల్లో మార్కెట్

**ముంబయి, మే 19:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఉదయం లాభాల బాట పట్టాయి. ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే ఇన్వెస్టర్లలో కొనుగోళ్ల ఉత్సాహం పెరగడంతో ప్రధాన సూచీలు గ్రీన్‌లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ దేశీయ మార్కెట్‌లో సానుకూల వాతావరణం కనిపిస్తోంది. ఉదయం ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 104 పాయింట్లు లాభపడి 23,751 స్థాయి వద్ద ట్రేడ్ అవుతోంది. మరోవైపు సెన్సెక్స్ కూడా 371 పాయింట్లు ఎగబాకి 75,684 మార్క్ వద్ద కొనసాగుతోంది. బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడం మార్కెట్‌కు మద్దతుగా నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల విషయానికి వస్తే.. అమెరికా డాలర్ ఇండెక్స్ ప్రస్తుతం 99.09 పాయింట్ల వద్ద కదలాడుతోంది. ప్రపంచ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 109.8 డాలర్ల వద్ద నమోదైంది. అలాగే అమెరికా 10 ఏళ్ల బాండ్ ఈల్డ్స్ 4.6 శాతం స్థాయిలో కొనసాగుతున్నాయి. ఈ అంశాలు గ్లోబల్ మార్కెట్లలో మిశ్రమ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. గత ట్రేడింగ్ సెషన్‌లో అమెరికా మార్కెట్లు ఒడిదుడుకులకు లోనయ్యాయి. ప్రధాన సూచీ ఎస్ అండ్ పీ 0.07 శాతం నష్టపోగా.. టెక్నాలజీ ఆధారిత నాస్డాక్ సూచీ 0.51 శాతం క్షీణించింది. అయినప్పటికీ భారత మార్కెట్లు మాత్రం కొనుగోళ్ల మద్దతుతో బలంగా నిలిచాయి. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. దేశీయంగా ఆర్థిక వ్యవస్థపై విశ్వాసం కొనసాగుతుండటం, కొన్ని కీలక రంగాల్లో కొనుగోళ్లు పెరగడం వల్ల సూచీలు లాభాల్లో కదులుతున్నాయి. అయితే అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల హెచ్చుతగ్గులు, విదేశీ పెట్టుబడిదారుల ధోరణి మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు.




# మళ్లీ పెరిగిన ఇంధన ధరలు

## వాహనదారులపై మరో భారం

**న్యూఢిల్లీ, మే 19 :** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరిగి వాహనదారులకు షాక్ ఇచ్చాయి. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు లీటర్ పెట్రోల్, డీజిల్‌పై 90 పైసల వరకు ధరలను పెంచాయి. వారం రోజుల వ్యవధిలోనే ఇంధన ధరలు రెండోసారి పెరగడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలే లీటర్‌కు రూ.3 వరకు ధరలు పెరిగిన నేపథ్యంలో తాజా పెంపు మరింత భారంగా మారింది. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెరగడంతో కొత్త ధరలు వరుసగా రూ.98.64, రూ.91.58కు చేరాయి. గత శుక్రవారం పెట్రోల్ ధర రూ.94.77 నుంచి రూ.97.77కు, డీజిల్ రూ.87.67 నుంచి రూ.90.67కు పెరిగిన విషయం తెలిసిందే. తాజా పెంపుతో ఇంధన ధరలు మరింత ఎగబాకాయి. ఆర్థిక రాజధాని ముంబైలో లీటర్ పెట్రోల్ ధర రూ.107.59కు చేరుకోగా, డీజిల్ ధర రూ.94.08గా నమోదైంది. కోల్‌కతాలో పెట్రోల్ ధర రూ.109.70కు, డీజిల్ రూ.96.07కు పెరిగింది. చెన్నైలో లీటర్ పెట్రోల్ రూ.104.49, డీజిల్ రూ.96.11 వద్ద విక్రయిస్తున్నారు. ముఖ్యంగా కోల్‌కతాలో పెట్రోల్‌పై అత్యధికంగా 96 పైసల పెంపు నమోదైంది. ముంబైలో పెట్రోల్‌పై 91 పైసలు, డీజిల్‌పై 94 పైసలు పెరిగాయి. చెన్నైలో పెట్రోల్‌పై 82 పైసలు, డీజిల్‌పై 86 పైసలు పెరిగాయి. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. అదే ప్రభావం దేశీయ మార్కెట్‌పై పడుతోందని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు మరింత పెరిగితే దేశంలో ఇంధన ధరలు ఇంకా పెరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇంధన ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు అధికమయ్యే అవకాశం ఉండటంతో పాటు, నిత్యావసర వస్తువుల ధరలపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ద్రవ్యోల్బణ ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు తాజా పెంపు మరో ఆర్థిక భారంగా మారింది.




# డిజిటల్ రూపాయి

## భారత ఆర్థిక వ్యవస్థలో కొత్త అధ్యాయం



**న్యూఢిల్లీ, మే 19:** భారత రిజర్వ్ బ్యాంక్ ప్రవేశపెట్టిన డిజిటల్ రూపాయి దేశ ద్రవ్య వ్యవస్థలో కీలక మార్పులకు నాంది పలుకుతోంది. సాధారణ కరెన్సీ నోట్లకు డిజిటల్ రూపంగా రూపొందించిన ఈ వ్యవస్థను ఆర్‌బీఐ భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా అభివర్ణిస్తోంది. ఇది క్రిప్టో కరెన్సీ కాదు.. నేరుగా ఆర్‌బీఐ జారీ చేసే అధికారిక డిజిటల్ నగదు కావడం విశేషం. ప్రస్తుతం దేశంలోని పలు ప్రధాన బ్యాంకులు డిజిటల్ రూపాయి వాలెట్ల సేవలను అందిస్తున్నాయి. యూపీఐ తరహా చెల్లింపుల వ్యవస్థలతో పోలిస్తే డిజిటల్ రూపాయి పూర్తిగా భిన్నమని నిపుణులు చెబుతున్నారు. యూపీఐలో బ్యాంకు ఖాతాల మధ్య డబ్బు బదిలీ జరుగుతుండగా.. డిజిటల్ రూపాయిలో మాత్రం ఆర్‌బీఐ జారీ చేసిన డిజిటల్ టోకెన్ల రూపంలో నేరుగా నగదు లావాదేవీ జరుగుతుంది. అందువల్ల ఇది కేవలం పేమెంట్ ప్లాట్‌ఫామ్ కాకుండా డబ్బు స్వరూపాన్నే ఆధునికీకరించే ప్రణాళికగా భావిస్తున్నారు. ఛాయిస్ వెల్త్ పరిశోధన విభాగం అధిపతి అక్షత్ గర్గ్ ప్రకారం డిజిటల్ రూపాయి వల్ల లావాదేవీలు వేగంగా పూర్తవడంతో పాటు సెటిల్‌మెంట్ రిస్కులు తగ్గుతాయి. అలాగే ఆర్థిక వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రోగ్రామబుల్ పేమెంట్స్, ఆఫ్‌లైన్ వినియోగం వంటి ఫీచర్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో కూడా డిజిటల్ చెల్లింపులు వేగంగా విస్తరిస్తాయని అభిప్రాయపడ్డారు. లాంగ్ టెయిల్ వెంచర్స్ వ్యవస్థాపకుడు పరమదీప్ సింగ్ మాట్లాడుతూ.. డిజిటల్ రూపాయిని యూపీఐకి పోటీగా చూడటం సరికాదన్నారు. ఇప్పటికే యూపీఐ ద్వారా భారత్ డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని, అయితే డిజిటల్ రూపాయి లక్ష్యం మరింత విస్తృతమైందని తెలిపారు. భవిష్యత్‌లో మొత్తం చెల్లింపుల వ్యవస్థకు ఇది మౌలిక వేదికగా మారే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఆఫ్‌లైన్ చెల్లింపులు, స్మార్ట్ కాంట్రాక్టులు, వేగవంతమైన క్లియరింగ్ వ్యవస్థలకు ఇది బలమైన ఆధారంగా నిలుస్తుందని చెప్పారు. అలంకిత్ లిమిటెడ్ సీఎఫ్ఓ గౌరవ్ మహేశ్వరి ప్రకారం 2025 మార్చి నాటికి రూ.1,016 కోట్ల విలువైన డిజిటల్ రూపాయి చలామణిలో ఉంది. లక్షలాది వాలెట్లు ఇప్పటికే వినియోగంలో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ పరిమితంగా ఉన్నా ఆఫ్‌లైన్ ఫీచర్ ద్వారా చెల్లింపులు సాధ్యమైతే డిజిటల్ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా డిజిటల్ రూపాయి లావాదేవీలు రూ.34,000 కోట్ల మార్క్‌ను దాటినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. మరిన్ని బ్యాంకులను భాగస్వామ్యం చేస్తూ ఆర్‌బీఐ దీని విస్తరణను వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ సబ్సిడీలు, సంక్షేమ పథకాల పంపిణీని మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చే సామర్థ్యం కూడా డిజిటల్ రూపాయికి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే సైబర్ భద్రత, వ్యక్తిగత గోప్యత, ప్రభుత్వ నిఘా వంటి అంశాలపై జాగ్రత్తలు అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ భవిష్యత్ ఆర్థిక వ్యవస్థలో డిజిటల్ రూపాయి కీలక పాత్ర పోషించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# ఏడాది వ్యాలిడిటీతో బీఎస్ఎన్ఎల్ చౌక ప్లాన్




**న్యూఢిల్లీ, మే 19 :** ప్రభుత్వ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారులను ఆకట్టుకునేందుకు మరో బడ్జెట్ ఫ్రెండ్లీ ప్రీపెయిడ్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏడాది కాలపరిమితితో అందిస్తున్న ఈ ప్లాన్‌లో రోజుకు 2 జీబీ హైస్పీడ్ డేటాతో పాటు అపరిమిత కాలింగ్ సదుపాయం కల్పిస్తోంది. ప్రైవేట్ టెలికాం సంస్థలతో పోలిస్తే తక్కువ ధరలో ఎక్కువ ప్రయోజనాలు అందిస్తున్న ఈ ప్లాన్ ప్రస్తుతం వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. బీఎస్ఎన్ఎల్ ప్రకటించిన వివరాల ప్రకారం ఈ ప్రత్యేక వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్ ధర రూ.2,399. ఈ ప్లాన్ కింద వినియోగదారులు పూర్తి 365 రోజుల వ్యాలిడిటీ పొందుతారు. దేశవ్యాప్తంగా ఏ నంబర్‌కైనా అపరిమిత ఉచిత కాలింగ్ సదుపాయం అందుబాటులో ఉంటుంది. అలాగే నేషనల్ రోమింగ్ కూడా పూర్తిగా ఉచితంగా లభిస్తుంది. డేటా ప్రయోజనాల విషయానికి వస్తే ప్రతిరోజూ 2 జీబీ హైస్పీడ్ డేటా అందించనున్నారు. మొత్తం ఏడాది కాలంలో 730 జీబీ డేటా వినియోగించే అవకాశం ఉంటుంది. అదనంగా రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు కూడా లభిస్తాయి. ఎక్కువ కాలం వ్యాలిడిటీతో చౌకగా ప్లాన్ కోరుకునే వినియోగదారులకు ఇది మంచి ఎంపికగా మారనుందని టెలికాం వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్‌కేర్ యాప్ లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా రీఛార్జ్ చేసుకునే వారికి సంస్థ 5 శాతం వరకు తగ్గింపును కూడా అందిస్తోంది. దీంతో వినియోగదారులు అదనంగా రూ.200 వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంటుంది. ఇక ఇతర దీర్ఘకాలిక ప్లాన్‌ల విషయానికి వస్తే బీఎస్ఎన్ఎల్ రూ.1,499 మరియు రూ.2,799 ధరల్లో కూడా ప్రత్యేక వార్షిక ప్లాన్‌లను అందిస్తోంది. రూ.1,499 ప్లాన్ 330 రోజుల వ్యాలిడిటీతో వస్తుండగా, రూ.2,799 ప్లాన్ పూర్తి 365 రోజుల కాలపరిమితిని కలిగి ఉంటుంది. ప్రత్యేకంగా రూ.2,799 ప్లాన్‌లో రోజుకు 3 జీబీ డేటా, అపరిమిత కాలింగ్, దేశవ్యాప్తంగా ఉచిత నేషనల్ రోమింగ్‌తో పాటు రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు కూడా లభిస్తాయి. అధిక డేటా వినియోగం చేసే వినియోగదారులకు ఈ ప్లాన్ మరింత ప్రయోజనకరంగా ఉంటుందని కంపెనీ చెబుతోంది. ప్రైవేట్ టెలికాం సంస్థలు వరుసగా టారిఫ్ ధరలు పెంచుతున్న నేపథ్యంలో తక్కువ ధరలో ఎక్కువ వ్యాలిడిటీ, అధిక డేటా అందిస్తున్న బీఎస్ఎన్ఎల్ ప్లాన్‌లు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి.

# క్రెడిట్ కార్డు వినియోగం జోరు




**ముంబై, మే 19:** దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో క్రెడిట్ కార్డు లావాదేవీలు కూడా రికార్డు స్థాయిలో పెరిగినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. 2021 నుంచి 2025 మధ్యకాలంలో క్రెడిట్ కార్డు ద్వారా జరిగిన లావాదేవీలు ఏకంగా 2.6 రెట్లు పెరిగినట్లు తాజా పేమెంట్ సిస్టమ్ నివేదికలో పేర్కొంది. ఆర్‌బీఐ వివరాల ప్రకారం.. 2021లో దేశవ్యాప్తంగా 216 కోట్ల క్రెడిట్ కార్డు లావాదేవీలు నమోదయ్యాయి. అయితే 2025 నాటికి ఈ సంఖ్య 570 కోట్లకు చేరుకుంది. విలువ పరంగా చూస్తే 2021లో రూ.8.9 లక్షల కోట్లుగా ఉన్న లావాదేవీలు.. 2025 నాటికి రూ.23.2 లక్షల కోట్లకు పెరిగాయి. అంటే సగటున ప్రతి ఏడాది 27 శాతం వృద్ధి నమోదైనట్లు నివేదిక వెల్లడించింది. మరోవైపు డెబిట్ కార్డు వినియోగం మాత్రం గణనీయంగా తగ్గినట్లు ఆర్‌బీఐ తెలిపింది. 2021లో 408.7 కోట్లుగా ఉన్న డెబిట్ కార్డు లావాదేవీలు 2025 నాటికి 133.6 కోట్లకు పడిపోయాయి. విలువ పరంగా కూడా 2021లో రూ.7.4 లక్షల కోట్లుగా ఉన్న లావాదేవీలు.. 2025 నాటికి రూ.4.5 లక్షల కోట్లకు తగ్గిపోయాయి. యూపీఐ, క్రెడిట్ కార్డుల వినియోగం పెరగడం వల్ల డెబిట్ కార్డుల ప్రాధాన్యం క్రమంగా తగ్గుతోందని నిపుణులు చెబుతున్నారు. క్రెడిట్ కార్డు మార్కెట్‌లో ప్రైవేట్ రంగ బ్యాంకుల ఆధిపత్యం మరింత బలపడినట్లు నివేదిక వెల్లడించింది. 2021లో 67.7 శాతంగా ఉన్న ప్రైవేట్ బ్యాంకుల క్రెడిట్ కార్డు వినియోగం 2025 చివరినాటికి 71.1 శాతానికి పెరిగింది. మరోవైపు ప్రభుత్వరంగ బ్యాంకుల వాటా మాత్రం 23.5 శాతం నుంచి 23.9 శాతానికి మాత్రమే పెరిగింది. డిజిటల్ లావాదేవీలపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన, ఈఎంఐ సౌకర్యాలు, రివార్డ్ పాయింట్లు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు వంటి అంశాలు క్రెడిట్ కార్డు వినియోగాన్ని వేగంగా పెంచుతున్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ షాపింగ్, ట్రావెల్, ఫుడ్ డెలివరీ, సబ్‌స్క్రిప్షన్ సేవల్లో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగినట్లు చెబుతున్నారు.




### ఆసియా క్రీడల బరిలోకి

# మరోసారి జ్యోతి సురేఖ

**మంత్రి లోకేశ్‌ను కలిసిన స్టార్ ఆర్చర్**

**రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి ప్రశంసలు**

**అమరావతి, మే 20 :** అంతర్జాతీయ విలువిద్యలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న ఆంధ్రప్రదేశ్ స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2026 ఆసియా క్రీడలకు వరుసగా నాలుగోసారి ఎంపికైన నేపథ్యంలో ఉండవల్లిలోని మంత్రి నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి సురేఖను మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. విలువిద్యలో నిలకడగా రాణిస్తూ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రానున్న ఆసియా క్రీడల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు. క్రీడాకారిణిగా ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని లోకేశ్ భరోసా ఇచ్చారు. క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ కూడా పాల్గొన్నారు. జ్యోతి సురేఖ సాధించిన విజయాలను కొనియాడుతూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.



### వైభవ్ సంబరాల వెనుక అసలు

# రహస్యం ఇదే..!

**జైపూర్, మే 20:** వైభవ్ సూర్యవంశీ మరోసారి తన విధ్వంసక బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానులను అలరించాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న ఈ యువ ఆటగాడు లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన కీలక పోరులో కేవలం 38 బంతుల్లోనే 93 పరుగులు చేసి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో పది భారీ సిక్సర్లు, ఏడు ఫోర్లు ఉండటం విశేషం. అర్ధ సెంచరీ పూర్తి చేసిన తర్వాత వైభవ్ చేసిన ప్రత్యేక సంబరాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. రెండు చేతుల వేళ్లను క్రాస్ చేస్తూ ఇచ్చిన ఫోజ్‌కు ప్రత్యేక అర్థం ఉందా అని అభిమానులు సోషల్ మీడియాలో చర్చించుకున్నారు. మ్యాచ్ అనంతరం మాజీ క్రికెటర్ మురళీ కార్తీక్ ఈ విషయంపై ప్రశ్నించగా వైభవ్ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. తాను చేసే ప్రతి మ్యాచ్‌లో కొత్త తరహా సంబరాలు చేసుకోవడం అలవాటేనని, ఆ ఫోజ్ వెనుక ఎలాంటి ప్రత్యేక సంకేతం లేదని స్పష్టం చేశాడు. గత మ్యాచ్‌లో కూడా భిన్నంగా సంబరాలు చేసుకున్నానని, ప్రతి సారి కొత్తగా ఏదో చేయాలని అనిపిస్తుందని తెలిపాడు. ఇదిలా ఉండగా ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాల్సిన కీలక మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ 96 పరుగులతో మెరిసగా, జోష్ ఇంగ్లిస్ 60 పరుగులతో ఆకట్టుకున్నాడు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ జట్టు 19.1 ఓవర్లలోనే మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. వైభవ్ సూర్యవంశీతో పాటు యశస్వి జైస్వాల్ 43 పరుగులు, ధృవ్ జురెల్ అజేయ అర్ధ సెంచరీతో జట్టును గెలిపించారు. ఈ విజయంతో రాజస్థాన్ లీగ్ పట్టికలో నాలుగో స్థానానికి చేరుకుంది. చివరి మ్యాచ్‌లో గెలిస్తే ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా నేరుగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించనుంది. వైభవ్ సూర్యవంశీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' పురస్కారం దక్కింది.

# కోల్‌కతా సూపర్ విక్టరీ!

- ముంబై ఇండియన్స్‌పై 4 వికెట్ల తేడాతో ఘన విజయం
- ఈ గెలుపుతో సజీవంగా కోల్ కతా ప్లే ఆఫ్స్ ఆశలు
- పంజాబ్, రాజస్థాన్ జట్ల ఫలితాలపైనే తదుపరి బెర్త్
- పాయింట్ల పట్టికలో 13 పాయింట్లతో ఆరో స్థానానికి చేరిక

ఐపీఎల్ టోర్నీలో కోల్‌కతా నైట్ రైడర్స్ అదరగొట్టింది. బుధవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఉత్కంఠ పోరులో ముంబై ఇండియన్స్‌పై 4 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ విజయంతో కోల్ కతా తన ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.






**కోల్‌కతా :** ఈడెన్ గార్డెన్స్ వేదికగా బుధవారం 2026 మే 20 న జరిగిన మ్యాచ్ లో టాస్ గెలిచిన కోల్ కతా నైట్ రైడర్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 147 పరుగులు మాత్రమే చేయగలిగింది. ముంబై బ్యాటర్లలో కార్బిన్ బాష్ 18 బంతుల్లో 32 పరుగులతో అజేయంగా నిలవగా, కెప్టెన్ హార్దిక్ పాండ్యా 27 బంతుల్లో 26 పరుగులు, తిలక్ వర్మ 32 బంతుల్లో 20 పరుగులు చేసి మోస్తరు స్కోరుకు పరిమితమయ్యారు. కోల్ కతా బౌలర్లలో కార్బిన్ బాష్ 3 ఓవర్లలో 30 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. దీపక్ చాహర్ 3 ఓవర్లలో 23 పరుగులిచ్చి ఒక వికెట్, అల్లాహ్ గజన్ఫర్ 4 ఓవర్లలో 25 పరుగులిచ్చి ఒక వికెట్ తీశారు.

**రాణించిన మనీష్ పాండే, పావెల్..**

148 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్ కతా నైట్ రైడర్స్ 18.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసి ఘన విజయం సొంతం చేసుకుంది. మరో 7 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకుంది. బ్యాటర్లలో మనీష్ పాండే 33 బంతుల్లో 45 పరుగులు చేసి జట్టు విజయానికి గట్టి పునాది వేశాడు. అతనికి తోడుగా రోవ్ మన్ పావెల్ 30 బంతుల్లో 40 పరుగులు, అజింక్య రహానే 17 బంతుల్లో 21 పరుగులు చేసి సత్తా చాటారు. ముంబై బౌలర్లలో కామెరూన్ గ్రీన్ 3 ఓవర్లలో 23 పరుగులిచ్చి 2 వికెట్లు, సౌరభ్ దూబే 4 ఓవర్లలో 34 పరుగులిచ్చి 2 వికెట్లు, కార్తీక్ త్యాగి 4 ఓవర్లలో 37 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు.



**ప్లే ఆఫ్స్ ఆశలు సజీవం..**

ఈ అద్భుత విజయంతో కోల్ కతా నైట్ రైడర్స్ ప్లే ఆఫ్స్ రేసులో తన ఆశలను సజీవంగా ఉంచుకుంది. పాయింట్ల పట్టికలో 13 మ్యాచ్ లు ఆడిన కోల్ కతా 6 విజయాలతో 13 పాయింట్లు సాధించి ఆరో స్థానానికి చేరుకుంది. అయితే కోల్ కతా ప్లే ఆఫ్స్ కు చేరాలంటే పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు ఆడే తదుపరి మ్యాచ్ ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాజస్థాన్ 13 మ్యాచ్ లలో 14 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉండగా, పంజాబ్ కింగ్స్ 13 మ్యాచ్ లలో 13 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఈ రెండు జట్ల ఫలితాలే కోల్ కతా ప్లే ఆఫ్స్ బెర్త్ ను ప్రభావితం చేయనున్నాయి. మరోవైపు ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో 13 మ్యాచ్ లు ఆడి కేవలం 4 విజయాలు, 9 ఓటములతో 8 పాయింట్లు మాత్రమే సాధించి తొమ్మిదో స్థానానికి పరిమితమైంది.

# కెప్టెన్సీ ఒత్తిడిపై కోహ్లీ భావోద్వేగం



**న్యూఢిల్లీ, మే 20 :** భారత టెస్టు జట్టుకు దాదాపు ఏడేళ్ల పాటు నాయకత్వం వహించిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, తాను టెస్టు కెప్టెన్సీ ఎందుకు వదులుకోవాల్సి వచ్చిందో తాజాగా వెల్లడించాడు. కెప్టెన్సీ బాధ్యతలు తనపై తీవ్ర మానసిక ఒత్తిడి మోపాయని, ఆ సమయంలో పూర్తిగా అలసిపోయినట్లు తెలిపాడు. టీ20 లీగ్‌ల హవా పెరిగిన సమయంలో కూడా అభిమానులను టెస్టు క్రికెట్ వైపు మళ్లించి, ఆటపై ఆసక్తిని పెంచిన ఆటగాడిగా కోహ్లీ ప్రత్యేక గుర్తింపు పొందాడు. భారత జట్టుకు 68 టెస్టుల్లో నాయకత్వం వహించిన అతడు 40 విజయాలు అందించి అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకడిగా నిలిచాడు. 2022 జనవరిలో అనూహ్యంగా టెస్టు కెప్టెన్సీకి రాజీనామా చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కోహ్లీ, ఆ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను వివరించాడు. "భారత జట్టు ఎప్పుడూ అగ్రస్థానంలో ఉండాలనే లక్ష్యంతోనే పని చేశాను. కానీ కెప్టెన్సీ నాపై ఎంతటి మానసిక భారాన్ని మోపిందో అప్పట్లో పూర్తిగా అర్థం కాలేదు. బ్యాటింగ్‌తో పాటు నాయకత్వ బాధ్యతలు కూడా నా వ్యక్తిగత జీవితంపై తీవ్ర ప్రభావం చూపాయి" అని కోహ్లీ చెప్పాడు. ప్రతి మ్యాచ్‌లో తన బ్యాటింగ్‌పై భారీ అంచనాలు ఉండేవని, అదే తనలో తీవ్ర ఒత్తిడికి కారణమైందని తెలిపాడు. "కెప్టెన్సీ వదిలే సమయానికి నేను పూర్తిగా అలసిపోయాను. ఆ బాధ్యతలు నన్ను తీవ్ర ఒత్తిడికి గురి చేశాయి. అందుకే నెమ్మదిగా ఆ బాధ్యతల నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నాను" అని వివరించాడు. కెప్టెన్సీ నుంచి తప్పుకున్న తర్వాత కూడా తాను క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొన్నట్లు కోహ్లీ తెలిపాడు. ఆ సమయంలో భారత మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ తనకు ఎంతో అండగా నిలిచారని గుర్తుచేసుకున్నాడు. "వారిద్దరితో ఎక్కువగా మాట్లాడేవాడిని. నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. నేను సాధించిన విజయాలు, రికార్డులను గుర్తు చేస్తూ మళ్లీ నాలో ఉత్సాహాన్ని నింపారు. వారి కోసం ఆడాలనిపించేలా నాలో నమ్మకం పెంచారు" అని కోహ్లీ భావోద్వేగంగా చెప్పాడు.

# పాకిస్థాన్‌పై బంగ్లా చారిత్రక విజయం

**సిల్హెట్, మే 20:** పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్ జట్టు చరిత్ర సృష్టించింది. రెండో టెస్టులో 78 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించిన బంగ్లాదేశ్, రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. పాకిస్థాన్‌పై స్వదేశంలో బంగ్లాదేశ్‌కు ఇదే తొలి టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. ఈ విజయంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2027 పాయింట్ల పట్టికలో బంగ్లాదేశ్ ఐదో స్థానానికి ఎగబాకింది. 58.33 శాతం విజయ శాతంతో భారత్‌ను వెనక్కి నెట్టింది. ఇప్పటివరకు తొమ్మిది టెస్టులు ఆడిన భారత జట్టు నాలుగు విజయాలు, నాలుగు ఓటములు, ఒక డ్రాతో 48.15 శాతం పాయింట్లతో ఆరో స్థానానికి పడిపోయింది. మరోవైపు ఈ సిరీస్ పరాజయంతో పాకిస్థాన్ ఎనిమిదో స్థానంలోనే కొనసాగుతోంది. చివరి రోజు 437 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 316 పరుగులకు ఏడు వికెట్ల నష్టంతో ఆట ప్రారంభించింది. అయితే బంగ్లాదేశ్ బౌలర్లు అద్భుతంగా రాణించి మరో 42 పరుగులకే మిగతా వికెట్లు కూల్చేశారు. దీంతో పాకిస్థాన్ జట్టు 358 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్



ఒంటరి పోరాటం చేశాడు. 94 పరుగులు చేసిన అతడు సెంచరీకి కేవలం ఆరు పరుగుల దూరంలో ఔటయ్యాడు. రిజ్వాన్ ఔటైన వెంటనే పాకిస్థాన్ ఇన్నింగ్స్ పూర్తిగా కుప్పకూలింది. బంగ్లాదేశ్ తరఫున తైజుల్ ఇస్లామ్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఆరు వికెట్లు పడగొట్టాడు. చివరి రోజు కీలక వికెట్లు తీసి జట్టు విజయానికి ప్రధాన కారణమయ్యాడు. ప్రమాదకరంగా మారిన రిజ్వాన్‌ను షోరిఫుల్ ఇస్లామ్ ఔట్ చేయడంతో బంగ్లాదేశ్ విజయం ఖాయమైంది. గతంలో 2024లో పాకిస్థాన్ గడ్డపై 2-0తో సిరీస్ గెలిచిన బంగ్లాదేశ్, ఇప్పుడు స్వదేశంలోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసి తమ ఆధిపత్యాన్ని చాటుకుంది.

చురకలు



# ఎన్టీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ






మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. ఇప్పటికే ఎన్నో రోజుల ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ.. ప్రశాంత్‌నీల్ 'డ్రాగన్' గ్లింప్స్‌తో ఫుల్ ట్రీట్ ఇచ్చారు. మరోవైపు ఎన్టీఆర్–త్రివిక్రమ్ కాంబోలో రానున్న 'గాడ్ ఆఫ్ వార్'గా ప్రచారంలో ఉన్న సినిమాకు సంబంధించి నాగవంశీ అప్‌డేట్ ఇచ్చారు. త్వరలోనే షూటింగ్ సెట్‌లో కలుద్దామంటూ ఆయన విషెస్ చెప్పారు. దీంతో ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇక అభిమానులు, సెలబ్రిటీలు తారక్‌కు శుభాకాంక్షలు చెబుతూ ఫొటోలు పంచుకుంటున్నారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌కి జన్మదిన శుభాకాంక్షలు. ఒక గొప్ప వారసత్వాన్ని నిలబెట్టుకోవడం అంత సులభం కాదు. కానీ మీరు దానిని ఎంతో గౌరవంతో, వినయంతో, అసాధారణమైన ప్రతిభతో ముందుకు తీసుకెళు తున్నారు. మీ వ్యక్తిత్వం ఎంత గొప్పదో చెప్పడానికి అదే నిదర్శనం. 'డ్రాగన్' గ్లింప్స్ అద్భుతమైన మాస్ విందులా ఉంది. మీరు ఇలాగే కోట్ల మంది హృదయాల్లో ఉంటూ బాక్సాఫీస్‌ను ఒక నిజమైన బాద్‌షాగా ఏలాలని కోరుకుంటున్నాన అంటూ శ్రీను వైట్ల పోస్ట్ చేశారు. హ్యాపీ బర్త్‌డే డియర్ తారక్. హద్దులు దాటి కీర్తిని సొంతం చేసుకున్న ఓ శక్తి ఇప్పుడు మరో గొప్ప ప్రపంచంతో మీ ముందుకు వస్తోంది. డ్రాగన్ గ్లింప్స్ అదిరిపోయింది అంటూ గోపీచంద్ మలినేని శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన వ్యక్తి. నేను అభిమానించే నా హీరో ఎన్టీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. లవ్ యూ కన్నా.. అంటూ నటి ఖుష్బూ విషెష్ చెప్పారు. హ్యాపీ బర్త్‌డే తారక్. నువ్వు ఆనందంగా ఉండాలని ఎన్నో మధురమైన జ్ఞాపకాలను సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నా. డ్రాగన్ గ్లింప్స్ అద్భుతంగా ఉంది అంటూ నారా రోహిత్ ఆనందం పంచుకున్నారు. పవర్‌హౌస్, నా రావణ.. తారక్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. మీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాను. 'డ్రాగన్' గ్లింప్స్ చాలా బాగుంది. మీ డ్యాషింగ్ లుక్ నాకు బాగా నచ్చింది. కచ్చితంగా చాలా పెద్ద హిట్ అవుతుందని బాబీ శుభాకాంక్షలు తెలిపారు.



# మోసపోయా!

## అనన్య నాగళ్ల భావోద్వేగం

**హైదరాబాద్, మే 20** :తెలుగు నటి అనన్య నాగళ్ల తాజాగా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలు వెల్లడిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన ఆమె సినిమాల్లోకి రాకముందు ప్రముఖ సంస్థ ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. నటనపై ఆసక్తితో షార్ట్ ఫిల్మ్స్ ద్వారా కెరీర్ ప్రారంభించి, తర్వాత సినీ రంగంలో అడుగుపెట్టారు. మల్లేశం చిత్రంతో వెండితెరకు పరిచయమైన అనన్య నాగళ్ల, తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం వకీల్ సాబ్, మ్యాస్ట్రో, ఊర్వశివో రాక్షసివో, శాకుంతలం, పొట్టేల్ వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనన్య నాగళ్ల తన జీవితంలో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని పంచుకున్నారు. "చాలా ఏళ్ల తర్వాత ఒక వ్యక్తి కారణంగా బాగా ఏడ్చాను. దాన్ని లవ్ ఫెయిల్యూర్ అని చెప్పను. కానీ నేను బాగా నమ్మిన వ్యక్తి నన్ను మోసం చేశాడు" అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. బ్రేకప్ బాధను దాదాపు మూడేళ్ల పాటు అనుభవించినట్లు ఆమె తెలిపారు. "ఉదయం లేవగానే ఆ ఆలోచనలు వెంటాడేవి. ఎంత బిజీగా ఉన్నా అవే గుర్తొచ్చేవి. రాత్రంతా ఏడ్చినా తెల్లవారగానే జిమ్‌కి వెళ్లేదాన్ని. షూటింగ్ సమయంలో కేరవాన్‌లో కూర్చొని ఏడ్చి, తర్వాత కళ్లు తుడుచుకుని కెమెరా ముందుకు వచ్చేదాన్ని" అని అనన్య చెప్పారు. అమ్మాయిల భావోద్వేగాలను సమాజం సరిగా అర్థం చేసుకోవడం లేదని కూడా ఆమె వ్యాఖ్యానించారు. "సోషల్ మీడియాలో అమ్మాయిల గురించి ఎన్నో మీమ్స్ వస్తుంటాయి. ఎక్కువగా అబ్బాయిల దృష్టికోణమే బయటకు వస్తుంది. కానీ అమ్మాయిల మనసులోని బాధ గురించి ఎవరూ మాట్లాడరు" అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం అనన్య నాగళ్ల చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



# హీరోతో నటించే ఛాన్స్ కోసం..

**ముంబై, మే 20:** తెలుగు సినీ ప్రేక్షకులకు పరిచయమైన నటి హెబ్బా పటేల్ మరోసారి వార్తల్లో నిలిచారు. కన్నడ చిత్రం 'అధ్యక్ష'తో సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె, 'అలా ఎలా' సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. అనంతరం 'కుమారి 21ఎఫ్' చిత్రంతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ సినిమా తర్వాత హెబ్బాకు వరుస అవకాశాలు వచ్చాయి. 'ఈడో రకం ఆడో రకం', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'అంధగాడు', 'మిస్టర్' వంటి చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. గ్లామర్ పాత్రలతో పాటు విభిన్న కథాంశాలున్న సినిమాల్లో కూడా నటిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఓటీటీ వేదికలపైనా అడుగుపెట్టి 'మస్తీస్', 'వ్యవస్థ' వంటి వెబ్ సిరీస్‌లలో కీలక పాత్రలు పోషించారు. ఇటీవల 'ఓదెల రైల్వే స్టేషన్' సినిమాతో మరోసారి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన అభిమాన హీరో గురించి హెబ్బా పటేల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు అత్యంత ఇష్టమైన నటుడు జూనియర్ ఎన్టీఆర్ అని ఆమె తెలిపారు. 'కుమారి 21ఎఫ్' టీజర్ విడుదల కార్యక్రమానికి ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా వచ్చినప్పటి నుంచి ఆయనపై ప్రత్యేక అభిమానం పెరిగిందన్నారు. తారక్ నటన, వ్యక్తిత్వం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ఎన్టీఆర్ సినిమాలో అవకాశం వస్తే ఎలాంటి పాత్రకైనా సిద్ధమని హెబ్బా వెల్లడించారు. పాత్రకు పెద్ద ప్రాధాన్యత లేకపోయినా, కథలో చిన్న భాగమే అయినా నటించేందుకు సిద్ధమేనన్నారు. కొన్నిసార్లు కెరీర్ కంటే మనసులోని కోరిక నెరవేర్చుకోవడం ముఖ్యమని వ్యాఖ్యానించారు. అలాగే నటుడు సునీల్ చాలా మంచివాడని, ఎంతో కేరింగ్‌గా ఉంటాడని చెప్పారు. నటుడు రాజ్ తరుణ్‌తో కలిసి ఎక్కువ సినిమాలు చేయడం వల్ల మంచి అనుబంధం ఏర్పడిందని తెలిపారు. అయితే వరుసగా కలిసి సినిమాలు చేయడంతో కొంత విరామం అవసరమని సరదాగా వ్యాఖ్యానించారు. తన కెరీర్‌లో 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', '24 కిస్సెస్' చిత్రాల్లో చేసిన పాత్రలు తనకు ఎంతో నచ్చాయని హెబ్బా చెప్పారు. ప్రస్తుతం తాను ఒంటరిగానే ఉన్నానని స్పష్టం చేశారు. ముంబైలో జన్మించిన హెబ్బా పటేల్ సామాజిక మాధ్యమాల్లో కూడా చురుకుగా ఉంటూ అభిమానులతో నిరంతరం మమేకమవుతున్నారు.

# మోడల్‌గా మొదలై..

## మిస్ గ్రాండ్ నుంచి సినీ ప్రపంచం వరకు..!

## పంకూరి గిద్వానికి పెరుగుతున్న గుర్తింపు



భారతీయ నటి, మోడల్ పంకూరి గిద్వాని ప్రస్తుతం సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన ఆమె 2016లో ఫెమినా మిస్ గ్రాండ్ ఇండియా కిరీటాన్ని అందుకొని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. 1997 అక్టోబర్ 2న జన్మించిన పంకూరి గిద్వాని, 2019లో విడుదలైన ఉజ్డా చమన్ చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. అనంతరం పలు ప్రాజెక్టుల్లో నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు ఆమె లవ్ మౌళి చిత్రంతో పరిచయమయ్యారు. ఇందులో హీరోగా నవదీప్ నటించగా, పంకూరి 'చిత్ర' పాత్రలో విభిన్నమైన నటన కనబరిచి మంచి ప్రశంసలు అందు కున్నారు. ఆలోచనల్లో ప్రత్యేకత కలిగిన యువతిగా ఆమె పోషించిన పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంది. నటనతో పాటు సామాజిక రంగంలోనూ పంకూరి తన ముద్ర వేస్తున్నారు. 2021లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 'ఖాదీ' ఉత్పత్తుల తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా ఆమెను నియమించారు. సంప్రదాయ వస్త్రాల ప్రచారంలో ఆమె కీలక పాత్ర పోషించారు. సినిమాలతో పాటు ఓటీటీ వేదికలలోనూ ఆమె రాణిస్తున్నారు. లీక్డ్! వంటి సిరీస్‌లతో పాటు 'గులాబీ రేవ్డి' వంటి ప్రాజెక్టుల్లో నటిస్తూ విభిన్నమైన పాత్రలను ఎంపిక చేసుకుంటున్నారు. యువ నటిగా పంకూరి గిద్వాని భవిష్యత్తులో మరిన్ని ఆసక్తికరమైన చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com